
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 17 జూలై 2024



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	39.3	21.9
భద్రాద్రి	29.0	18.0

రైతు రుణమాఫీకి వేళాయే..

- రూ..లక్ష లోపు ఉన్నవారికి రేపు నిధులు జమ
- జాబితా సిద్ధం చేస్తున్న వ్యవసాయాధికారులు
- రైతు వేదికల్లో సంబురాలకు ఏర్పాట్లు

ఖమ్మం, జూలై 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతు రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రుణమాఫీ విధివిధానాలు ప్రకటించిన ప్రభుత్వం తొలివిడత మాఫీకి 18న శ్రీకారం చుట్టబోతోంది. ముందుగా రూ.లక్షలోపు రుణాలు ఉన్నవారికి 18న నిధులు జమ చేయబోతున్నారు. అదేరోజు రైతువేదికల్లో సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.2లక్షల రుణమాఫీ అర్హుల జాబితాను వ్యవసాయశాఖ, బ్యాంకర్లు సిద్ధం చేస్తున్నారు. పాసుపుస్తకం ఆధార్‌కార్డు, రేషన్‌కార్డును అనుసంధానం చేస్తూ కుటుంబానికి రూ.2లక్షల చొప్పున రుణమాఫీ చేయబోతున్నారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న రైతు రుణమాఫీకి శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. మొదటి విడతగా రూ.లక్ష వరకు రుణాలున్నవారికి నిధులు జమకానున్నాయి. బ్యాంకర్లు కూడా ప్రభుత్వం రుణమాఫీకి ఇస్తున్న సొమ్ములను కేవలం రుణమాఫీకే జమచేయాలని, ఇతర అప్పులకు మళ్లించవద్దని సూచించారు. ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గత డిసెంబరు 31వరకు ఖమ్మం జిల్లాలో మొత్తం 3,73,157మంది రైతులు రూ.4307.58 కోట్ల రుణాలు తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,86,034 మంది రైతులు రూ.1816.35 కోట్లు రుణాలు తీసుకున్నారు. రెండు జిల్లాల్లో రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు రుణాలు తీసుకున్నవారున్నారు. అయితే రూ.2లక్షల లోపు ఎంతమంది రైతులున్నారన్న దానిపై ఇప్పుడు వ్యవసాయశాఖ బ్యాంకర్లు జాబితా సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో 18వ తేదీన రూ.లక్ష వరకు రుణాలు ఉన్నవారికి ప్రభుత్వం నిధులు జమచేయనుంది. అదేరోజు రైతు వేదికల్లో సంబురాలు నిర్వహించనున్నారు. ఈ సంబురాలకు ఆయా నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు.

నేడు తొలి ఏకాదశి

- ప్రకృతి, వ్యవసాయానికి ముడిపడి ఉన్న పండుగ
- నేటితోనే హిందువుల పండుగలు ప్రారంభం

ఖమ్మంసాంస్కృతికం, జూలై 16: హిందువులు పరమపవిత్ర పండుగైన తొలి ఏకాదశి నేడు నిర్వహించనున్నారు. ప్రకృతి, వ్యవసాయం, సామాజిక అంశాలు ఈ పండుగతో ముడిపడి ఉండడంతో హిందువులు ఈ పండుగకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. పంచాంగం, క్యాలెండర్లను అనుసరించి ఏడాదిలో 24 ఏకాదశి రోజులు ఉంటాయి. కానీ ఆషాఢ మాసం శుక్లపక్షం రోజున వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. తొలి ఏకాదశి రోజునుంచి విష్ణుమూర్తి పాలకడలిలో యోగనిద్రలోకి వెళతాడని, అందుకు దీనికి శయన ఏకాదశి అన్నపేరు కూడా ఉంది. పూర్వ కాలంలో తొలిఏకాదశి రోజునుంచే కొత్త సంవత్సరంగా భావించే వారు. ఈ రోజున వ్యవసాయ, తదితర సామాజిక కార్యక్రమాలను ప్రారంభించే ఆచారం ఉంది. తొలిఏకాదశి నుంచే దక్షిణాయనం ప్రారంభమవుతుండగా హిందువుల పండుగలకు ఏకాదశి శ్రీకారం చుట్టినట్లు అవుతుంది. ఏకాదశి అనంతరం వరుసగా పండుగలు రావడంతో పాటు కాల గమనంలో పగలు రాత్రి సమయాల్లోనూ స్వల్ప వ్యత్యాసం ఉంటుంది. ఏకాదశి రోజునుంచి రాత్రి కాలం పెరుగుతూ వస్తుంది. తొలిఏకాదశి నుంచే పల్లెల్లో వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి. ఈ పండుగకు జలవనరులకూ ముడి పడి ఉంది. ఏరు ముందా, ఏకాశి ముందా అన్న సామెత సంప్రదాయంగా ఏర్పడింది. ఏకాదశి నాటికి జలవనరులు నీటి సంపదతో కళకళలాడుతూ వ్యవసాయయోగ్యంగా మారతాయని భావిస్తారు. ఏకాదశి తెలుగు సంస్కృతి, ఆచార వ్యవహారాలతో ముడిపడి ఉండటంతో ఏకాదశికి అత్యంత విలువనిస్తారు. ఏకాదశి రోజున ఆలయాల్లో భక్తుల రద్దీ పెరుగుతుంది. ఏకాదశి రోజు ఉపవాసాలుండటం శ్రేష్ఠంగా భావిస్తారు. విష్ణు నామ పారాయణం, భగవాన్ దీక్షతోపాటు జొన్నలు, బెల్లంతో పేలపిండి అనే ప్రత్యేక తీపి పదార్థాన్ని తయారు చేసుకోవటం ఇప్పటికీ పాటిస్తున్నారు. పేలపిండిని తయారు చేసుకోలేని ఆధునికులు, ఉద్యోగులు, వ్యాపారుల కోసం స్వీట్ షాపుల్లో రెడీమేడ్‌గా పేలపిండి లభిస్తుంది.



నేడు మొహర్రం..

ఖమ్మం నగరంలో నేడు పీర్ల ఊరేగింపు

ఖమ్మంసాంస్కృతికం, జూలై 16: త్యాగానికి ప్రతీకైన మొహర్రంను బుధవారం ముస్లింలు నిర్వహించనున్నారు. ఇది ముస్లింలకు ప్రత్యేకమైన పీర్ల ఉత్సవంలో హిందువులు సైతం భాగస్వాములవుతారు. హిందువులు కూడా పీర్లను నిలుపుకొని ఏటా భక్తిశ్రద్ధలతో పూజాదికాలు నిర్వహిస్తారు. ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీర్లను నిలిపే సంస్కృతి ఆదినుంచి కొనసాగుతోంది. వారం రోజుల క్రితమే సంప్రదాయబద్ధంగా పీర్ల కొట్టాలలో పీర్లను ప్రతిష్ఠించి రోజువారి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆఖరి రోజును మొహర్రంగా పాటించి పీర్లను నిమజ్జనం చేస్తారు. మొహర్రం సందర్భంగా బుధవారం ఖమ్మం నగరంలో పీర్ల ఊరేగింపు నిర్వహించి అనంతరం మున్నేటిలో నిమజ్జనం చేస్తారు.

పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక..

పురుగులమందు తాగి విద్యార్థిని ఆత్మహత్య



తోలెం నిహారిక(ఫైల్)

గుండాల, జూలై 16: పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక ఓ విద్యార్థిని పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. భద్రాద్రి జిల్లా గుండాల మండలం సాయనపల్లి గ్రామానికి చెందిన తోలెం నిహారిక(13) స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేసి ఇటీవల మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో 8వ తరగతిలో చేరింది. కాగా శని, ఆదివారాలు సెలవు రావడంతో ఇంటికి వెళ్లింది. సోమవారం పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు నిహారికకు సూచించారు. అయితే తాను పాఠశాలకు వెళ్లనని ఇంటివద్దనే ఉంది. ఈ క్రమంలో పాఠశాలకు వెళ్లడం ఇష్టం లేక మంగళవారం తెల్లవారు జామున పురుగులమందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను తల్లిదండ్రులు గుండాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108 ద్వారా కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ ఘటనపై గుండాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీలకు రంగం సిద్ధం

- జాబితా సిద్ధం చేసిన పోలీసు శాఖ
- పీసీల నుంచి ఏఎస్ఐల వరకు 172 మంది
- ర్యాంకులు, స్టేషన్లవారీగా వివరాలు పంపిన అధికారులు
- స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న15 మంది కూడా..

ఖమ్మం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్లలో పాతుకుపోయిన సిబ్బందిని బదిలీ చేసేందుకు పోలీసుశాఖ ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేశారు. ఏళ్ల తరబడి ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్న వారి జాబితాను తయారుచేసి ఆయా సిబ్బందిని బదిలీ చేయాలని నిర్ణయించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లతో పాటు, అటాచ్‌మెంట్‌లో ఉన్న వారిని సైతం బదిలీ చేయాలని నిర్ణయించి ఆయా సిబ్బంది వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్ల అధికారులకు పంపించారు. పోలీస్‌కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు 172 మంది జాబితాను తయారు చేసిన అధికారులు ఆయా సిబ్బంది ఎప్పటినుంచి సంబంధిత స్టేషన్లో పనిచేస్తున్నారనే అంశాలను పొందుపరుస్తూ ప్రొఫార్మ తయారుచేసి దానిని స్టేషన్లలోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలంటూ ఎస్‌హెచ్‌వోలకు సమాచారం అందించినట్లు తెలిసింది. ఏఎస్ఐ స్థాయి ర్యాంకు అధికారులు మూడేళ్లు, హెడ్‌కానిస్టేబుల్ స్థాయి వారికి నాలుగేళ్లు, కానిస్టేబుల్‌స్థాయి వారికి ఐదేళ్లు కాలపరిమితిగా పరిగణనలోకి తీసుకుని బదిలీల జాబితాలో పొందుపర్చినట్లుగా తెలుస్తోంది. కాగా సదరు జాబితాలో 43మంది ఏఎస్ఐ స్థాయి ర్యాంకు వారు, 51 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 78 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

స్పెషల్ బ్రాంచ్ వారు కూడా..

ఎక్కువ సంవత్సరాలు విడుదల చేసిన జాబితాలో భాగంగా ఒకేస్థానంలో ఉన్నవారి వివరాల్లో స్పెషల్ బ్రాంచ్‌వారు కూడా ఉండటం గమనార్హం. అది కూడా ఒకరిద్దరు కాదు.. సుమారు 15 మంది వరకు జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో ఏఎస్ఐ స్థాయి వారు ఐదుగురు ఉండగా, హెడ్‌కానిస్టేబుల్ స్థాయి వారు ఏడుగురు, ఒక కానిస్టేబుల్ ఉన్నట్లు సమాచారం. ఇటీవల నిఘా వర్గాల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయారన్న అంశాన్ని ప్రస్తావిస్తూ రెండ్రోజుల క్రితం 'పారదర్శకతకు పాతర' శీర్షికన కథనం ప్రచురించింది. కాగా ప్రస్తుతం బదిలీల జాబితాను పరిశీలిస్తే 'ఆంధ్రజ్యోతి' కథనం అక్షరసత్యం అని మరోసారి రుజువైంది. వారితో పాటుగా జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో సైతం సిబ్బంది ఏళ్లతరబడి ఒకే పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. స్టేషన్ల వారీగా బదిలీ జాబితాలో అత్యధికంగా ఉన్న సిబ్బంది వివరాలను పరిశీలిస్తే ఖమ్మం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో 15 మంది, రఘునాథపాలెంలో ఆరుగురితోపాటు అత్యధికమంది ఉన్నారు. వారితోపాటు మిగిలిన పోలీస్‌స్టేషన్లలో ర్యాంకుల వారీగా ఎక్కువకాలం అటాచ్‌మెంట్లలో ఉన్నవారిని సైతం బదిలీ జాబితాలో పొందుపర్చారు.



ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

ఏపీ శాసనమండలి సెక్రటరీగా

ఖమ్మం వాసి

కాంట్రాక్ట్ పద్ధతిలో సూర్యదేవర ప్రసన్నకుమార్ నియామకం



ఖమ్మం, జూలై 16 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా ఖమ్మం నగరానికి చెందిన సూర్యదేవర ప్రసన్నకుమార్ కాంట్రాక్టు పద్ధతిలో నియమితులయ్యారు. ఏపీలో శాసనమండలి సెక్రటరీ జనరల్ పదవికి రామాచార్యులు రాజీనామా చేయడంతో ఆ పదవిలో ప్రసన్నకుమార్‌ను ఏపీ ప్రభుత్వం నియమించింది. ఖమ్మానికి చెందిన ప్రసన్న కుమార్ ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆలిండియా రేడియో న్యూస్‌రీడర్‌గా పనిచేసిన ప్రసన్నకుమార్ ఆ తర్వాత ఢిల్లీలో పలు కీలక శాఖల్లో పని చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓఎస్డీగా, ఢిల్లీ శాసనసభ కార్యదర్శిగా, సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌గా, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఓఎస్డీగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం ఏపీ రాష్ట్ర శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా నియమితులయ్యారు.



ప్రముఖ గుండె, రక్తనాళ వైద్య నిపుణులు
KHIMS హాస్పిటల్, ఖమ్మంలో...
డా॥ డి. క్రిష్ణ కిషోర్
MD, DNB (CARDIO), FACC
Senior Interventional Cardiologist
2024 జూలై 17 18 19 తేదీలలో
బుధ, గురు, శుక్రవారాలలో ఉ. 10 గం.ల నుండి సా. 5 గం.ల వరకు
స్పెషల్ కార్డియాక్ ప్యాకేజ్
ECG, 2D Echo, Lipid Profile, Sr. Creatinine, Dr. Consultation ₹ ~~2499/-~~ ₹ 666/- ONLY
TMT, ECG, 2D Echo, Lipid Profile, Sr. Creatinine, Dr. Consultation ₹ ~~3999/-~~ ₹ 999/- ONLY
35 సం॥లు వయస్సు పైబడినవారు, షుగరు, బిపి వున్నవారు, పొగత్రాగడం, గుట్కా నమలడం వంటి అలవాట్లు కలవారు, కుటుంబంలో చిన్న వయస్సులో గుండె జబ్బు ఉన్నవారు ముందు జాగ్రత్తగా పై పరీక్షలు చేయించుకొని మీ గుండెను పదిలంగా ఉంచుకోగలరని కోరుచున్నాము.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కలదు. ఇన్సూరెన్స్ సౌకర్యం కలదు
KHIMS HOSPITALs A TOUCH OF CARE
బాబురావు పెట్రోల్‌బంక్ ఎదురుగా, వైరా రోడ్, ఖమ్మం.
ఫోన్ : 08742-252112
7799 76 77 88

మాయదారి రోగం..



- అటవీ గ్రామం చిరుతానుపాడులో వింత జబ్బు
- ఇంటికొకరికి జ్వరం.. చిన్నారులకు అంతుచిక్కని పుండ్లు
- మంచంపట్టిన గ్రామస్థులు
- చెట్ల వేర్లతోనే స్థానికంగా పసరు వైద్యం
- ఐదు కిలోమీటర్ల దూరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- వాగులు, వర్రెల దారిలో అక్కడికి వెళ్లడం అసాధ్యం
- నిత్యావసరాలకు వాగునీరే దిక్కు
- దోమలు, చిమ్మచీకటితో సహవాసం

6

రైతుల అవసరాల మేరకు గిడ్డంగుల నిర్మాణం

- గిడ్డంగులు లేక దళారుల పాలవుతున్న వ్యవసాయ ఉత్పత్తులు
- కష్టపడినవారికి కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంది
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి సాగుతా
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు
- ప్రమాణస్వీకారం తర్వాత తొలిసారి ఖమ్మానికి రాక



మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమవిభాగం, జూలై 16: రైతుల అవసరాల మేరకు రాష్ట్రంలో గోదాముల నిర్మాణం చేపడతామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంట దళారుల బారిన పడకుండా రాష్ట్ర వ్యాప్తంగా గిడ్డండుల నిర్మాణం చేసేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర గిడ్డండుల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం తొలి సారి ఖమ్మానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పాలేరు నుంచి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, గ్రానైట్ వ్యాపారులు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ తానూ రైతు బిడ్డనేని, రైతుల అవసరాలు, కష్టాలు తనకు తెలుసన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అధికారంలో ఉన్నా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్రంలో వరి, మిర్చి, మొక్కజొన్న, పత్తి తదితర పంటల ఉత్పత్తి పెరిగిందని అయితే ఆ మేరకు గిడ్డంగులు అందుబాటులో లేక రైతుల కష్టం దళారుల పాలవుతోందన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను విస్మరించిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు రాష్ట్రంలో 25 గోదాములు ఉంటే రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవలం 25గోదాములనే నిర్మించిందన్నారు. 250 గోదాములను అద్దెకు తీసుకొని వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ ఉంచుతుందన్నారు. గత ప్రభుత్వం గోదాముల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా గోదాములు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో గిడ్డంగుల సంస్థను ముందుకు తీసుకెళతానన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పోరాటాలు చేసి జైలుకు వెళ్లిన తనలాంటి నాయకులకు కాంగ్రెస్ పార్టీలో ఖచ్చితమైన గుర్తింపు ఉందన్నారు. తనకు పదవీ రావడమే ఇందుకు నిదర్శనవని రాయల పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు గ్రామస్థాయి నుంచి పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మొక్కా శేఖర్‌గౌడ్, వడ్డే నారాయణరావు పాల్గొన్నారు. అనంతరం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్, రాష్ట్ర నాయకుడు వడ్డెబోయిన నర్సింహారావు తదితరులు రాయల నాగేశ్వరరావును సన్మానించారు.

త్వరలో నాగపూర్-అమరావతి

హైవే పనులకు శ్రీకారం

- ఖమ్మంరూరల్‌లో నేషనల్ హైవే అథారిటీ కార్యాలయం
- చురుగ్గా సాగుతున్న మ్యాపింగ్ పనులు

6

రూ.3వేల కోసం

అమ్మమ్మను చంపాడు

- గంజాయి మత్తులో ఓ యువడి ఘాతుకం
- ఖమ్మం నగరంలో సంచలనం

7



రాంబాయమ్మ (ఫైల్)

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్

ప్రాంతీయ కార్యాలయం : ఎన్‌జీఓస్ కాలనీ రోడ్, పాత బస్‌డిపో సమీపమున, రాంనగర్, హనుమకొండ-506001

స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం కొరకు బహిరంగ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ అఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (నం.54 ఆఫ్ 2002) క్రింద బ్యాంక్‌కు తనఖా పెట్టబడిన స్థిరాస్తుల అమ్మకం

బ్యాంక్ బకాయిలు ప్లస్ దిగువ వివరించిన విధంగా వడ్డీ మరియు వ్యయాలు చెల్లించుటలో విఫలమైన మీదట బకాయిలు వసూలు కొరకు "ఎక్కడ ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏమి ఉన్నదో అది" ప్రాతిపదికన దానిని విక్రయించు హక్కుతో పాటు దిగువ రుణ ఖాతాలో సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద జారీ చేయబడిన ప్రకటనకు అనుగుణంగా దిగువ అస్తిని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. సదరు చట్టం లోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు సదరు ఆస్తి అమ్మకం ద్వారా బ్యాంక్ బకాయిలు వసూలు కొరకు ప్రతిపాదిస్తున్నారు. వెబ్ పోర్టల్: (https://ebkray.in/education-psb/bidder-registration(or) https://ebkray.in) వద్ద ఏర్పాటు చేయబడిన ఇ-వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా దిగువ సంతకందారుచే అమ్మకం నిర్వహించబడును.

శాఖ పేరు : మధిర - ఖమ్మం

క్ర. సం.	రుణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేరు మరియు చిరునామా	స్వాధీనతా విధానం & స్థిరాస్తుల వివరణ	బకాయి మొత్తం	రిజర్వు ధర (రూ.)	బయానా దాఖలుకు చివరి తేది & సమయం	ఇ-వేలం తేది మరియు సమయం
4.	శ్రీ కొప్పు ఎస్.జె.నాదం గుప్త (రుణ గ్రహీత/తనఖాదారు) తండ్రి కోటేశ్వర రావు, డి.నం. 2-80, ఎర్రుపాలెం మండలం & గ్రామం, ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం- 507201	మొత్తం విస్తీర్ణం 111.00 చదరపు గజాలలో, తెలంగాణ- 507203, ఖమ్మం జిల్లా, మధిర మండలం, దిదుగుపాడు గ్రామం, ప్రభుత్వ హైస్కూల్‌కు సమీపాన, డి.నం.1-81 కలిగిన నివాసిత భవనం అస్తి యావత్తు. (తనఖాదారు- శ్రీ కొప్పు ఎస్.జె.నాదం గుప్త తండ్రి కోటేశ్వరరావు), సరిహద్దులు: ఉత్తరం: ఎస్.నాగేశ్వరరావు ఇల్లు, దక్షిణం: బండి రామా రావు భూమి, తూర్పు: 20'-00" వెడల్పు రోడ్, పశ్చిమం: బి.వెంకటేశ్వర్లు ఇల్లు.	03.07.2024 నాటికి రూ. 14,26,248/- + తదుపరి వడ్డీ వర్ల కాంట్రాక్చువల్ రేటు వంతున మరియు రెస్టులతో పాటు ఖర్చులు, చార్జీలు వగైరా.	రూ.15,00,000/- బయానా (రూ.) రూ.1,50,000/- బిడ్ పెరుగుదల (రూ.) రూ. 50,000/- ఆటో పొడిగింపు సమయం 10 నిమిషాలు	05.08.2024	06.08.2024 (మంగళవారం) ఉ.11.00 గం.ల నుండి మ.1.00 గం.ల మధ్య

ఖాతా వివరాలు: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఖాతా పేరు: SARFAESI అమ్మకం పార్కింగ్ అకౌంట్, ఖాతా నంబర్: 21610113035001, IFSC కోడ్: IOBA0002161. కాగోరు బిడ్డర్లు కార్యాలయ వేళల్లో అధీకృత అధికారి/చీఫ్ మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పొట్టి శ్రీరాములు చౌరస్తా, మధిర, ఖమ్మం-507203 వారిని సంప్రదించవచ్చును. ఫోన్ నం: 08749-272001, మొబైల్ నం. 8978554332/8925952161. మెయిల్ ఐడి : iob 2161@iob.in

శాఖ పేరు : నాయుడుపేట్ - ఖమ్మం

క్ర. సం.	రుణగ్రహీతలు / తనఖాదారులు / హామీదారుల పేరు మరియు చిరునామా	స్వాధీనతా విధానం & స్థిరాస్తుల వివరణ	బకాయి మొత్తం	రిజర్వు ధర (రూ.)	బయానా దాఖలుకు చివరి తేది & సమయం	ఇ-వేలం తేది మరియు సమయం
5.	మెసర్స్ హేమలత గ్రానైట్స్ (రుణగ్రహీత/తనఖాదారు) ప్రాతినిధ్యం వహిస్తున్నది దీని యజమాని శ్రీ సిద్దినేని కరుణ కుమార్ చిరునామా సర్వే నం. 40,గొల్లపాడు రోడ్‌కు ఆనుకుని ఉన్న, ఎం.వెంకటాయపాలెం గ్రామం మరియు గ్రామపంచాయతీ పరిధులు, పల్లెగూడెం, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం-507003. 2) శ్రీ సిద్దినేని కరుణ కుమార్ (రుణగ్రహీత) తండ్రి కోటయ్య నివాసం 3-87, బ్లాక్ 1 నుండి 3, గూడూరుపాడు గ్రామం, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం- 507003.	మెసర్స్ హేమలత గ్రానైట్స్, యజమాని శ్రీ సిద్దినేని కరుణ కుమార్ పేరున కలిగిన ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలం, పల్లెగూడెం రెవెన్యూ గ్రామం వద్ద గల ఎ.0.14 గుంటల విస్తీర్ణం కలిగిన సర్వే నం. 40 (భాగం) లో గ్రౌండ్ మరియు మొదటి అంతస్తులో మెయిన్ షెడ్, పాలిష్ షెడ్ మరియు కార్యాలయ రూమ్ స్ట్రక్చర్‌తోపాటు పారిశ్రామిక భూమి అస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: రుద్ర ఉపేందర్ భూమి, దక్షిణం: గార్ల సంగయ్య, వెంకన్న మరియు కోటయ్య భూమి, తూర్పు: ఎలమద్ది భారతమ్మ భూమి, పశ్చిమం: గొల్లపాడుకు వెళ్లే 60 అడుగుల వెడల్పు రోడ్.	09.10.2023 నాటికి రూ. 22,79,840/- + తదుపరి వడ్డీ వర్ల కాంట్రాక్చువల్ రేటు వంతున మరియు రెస్టులతో పాటు ఖర్చులు, చార్జీలు వగైరా.	రూ.27,20,000/- బయానా (రూ.) రూ.2,72,000/- బిడ్ పెరుగుదల (రూ.) రూ. 50,000/- ఆటో పొడిగింపు సమయం 10 నిమిషాలు	05.08.2024	06.08.2024 (మంగళవారం) ఉ.11.00 గం.ల నుండి మ.1.00 గం.ల మధ్య

ఖాతా వివరాలు: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఖాతా పేరు: SARFAESI అమ్మకం పార్కింగ్ అకౌంట్, ఖాతా నంబర్: 17040113035001, IFSC కోడ్: IOBA0001704. కాగోరు బిడ్డర్లు కార్యాలయ వేళల్లో అధీకృత అధికారి/చీఫ్ మేనేజర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బిషప్స్ హౌస్, నాయుడుపేట్, ఖమ్మం-507003, వారిని సంప్రదించవచ్చును. ఫోన్ నం: 08742-252320, మొబైల్ నం. 9502212306/8925951704. మెయిల్ ఐడి: iob 1704@iob.in

* చట్టబద్ధమైన బకాయిల కంటే బ్యాంకు బకాయిలకు ప్రాధాన్యత కలదు & స్థానిక సెల్ఫ్ గవర్నమెంట్ యొక్క బకాయి మొత్తాలు రూ. లేవు. (అస్తి పన్ను, నీటి కుల్లాలు, విద్యుత్ బిల్లులు మొదలైనవి) నియమాలు మరియు నిబంధనల కొరకు https://ebkray.in/eauction-psb/bidder-registration (or) https://ebkray.in (సర్వీసు ప్రొవైడర్ యొక్క ఇ-వేలం వెబ్ పోర్టల్).

ప్రదేశము : ఖమ్మం, తేది : 15.07.2024

సం/- అధీకృత అధికారి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్



రెబ్బవరంలోని బీసీ గురుకులాల విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

బీసీ గురుకులానికి భవనాల అన్వేషణ

» ప్రత్యేక దృష్టిసారించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూలై 16: మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటుకు అవసరమైన ప్రైవేట్ భవనం కోసం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవతో అన్వేషణ చేపట్టారు. రెబ్బవరంలోని ఒక మూతపడిన ప్రైవేట్ పాఠశాల భవనంలో మునలిమడుగు, వైరా పేర్లతో ఉన్న 749మంది విద్యార్థినులతో రెండు బీసీ బాలికల గురుకుల పాఠశాలలు అత్యంత దయనీయస్థితిలో నిర్వహిస్తున్నారు. ఒకే భవనంలో రెండు గురుకులాల నిర్వహణతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలపై విద్యార్థినుల తల్లిదండ్రులు రోడ్డెక్కారు. సీపీఎం, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. 'ఆంధ్రజ్యోతి' సహా అన్ని దినపత్రికల్లో గురుకులాల సమస్యలపై కథనాలు రావడంతో జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ స్పందించి వెంటనే జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జ్యోతి, బీసీ గురుకులాల ఆర్‌సీవో అంజలిని ఈ పాఠశాల స్థితిగతులపై తనిఖీ చేసి నివేదించాలని ఆదేశించారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్పందించి సోమవారం రాత్రి హఠాత్తుగా ఈ గురుకులాలను సందర్శించారు. కొన్నిగంటలపాటు ఆపాఠశాల మొత్తాన్ని కలియతిరిగి విద్యార్థులు వారి తల్లిదండ్రులు చెప్పిన సమస్యలను ఓపిగ్గా ఆలకించారు. గురుకులాల యాజమాన్యంతో మాట్లాడి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారంరోజుల్లో ఇక్కడి గురుకులాన్ని మరో చోటుకు తరలిస్తామని విద్యార్థినులు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాలతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు మంగళవారం వైరాలో మూతపడిన పలు పాఠశాలల భవనాలను పరిశీలించారు. వైరా నడిబొడ్డునే ఉన్న ఠాగూర్ విద్యాసంస్థలకు చెందిన భవనాలు బీసీ గురుకులం ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయని నాయకులు నిర్ధారణకు వచ్చి దాని యాజమాన్యంతో సంప్రదింపులు జరిపారు. అందుబాటులో ఉన్న ఈ భవనాల గురించి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో చర్చించి ఆతర్వాత జిల్లా కలెక్టర్, బీసీ గురుకుల అధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ భవనాల్లో గురుకులాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రయత్నాలు చేపట్టారు.

మాయదారి రోగం..

అటవీ గ్రామం చిరుతానుపాడులో వింత జబ్బు



- » ఇంటికొకరికి జ్వరం.. చిన్నారులకు అంతుచిక్కని పుండ్లు
- » మంచంపట్టిన గ్రామస్థులు
- » చెట్ల వేర్లతోనే స్థానికంగా పసరు వైద్యం
- » ఐదు కి.మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- » వాగులు, వర్రెల దారిలో అక్కడికి వెళ్లడం అసాధ్యం
- » వాగునీరే వారికి దిక్కు

పాల్వంచ రూరల్, జూలై 16: దట్టమైన అటవీ ప్రాంతంలోని ఆదివాసీల గ్రామం.. ఇంటికొకరు జ్వరాల బారిన పడి లేవలేని స్థితిలో ఉన్నారు. చిన్న పిల్లలకు అంతుచిక్కని పుండ్లతో బాధపడుతున్నారు. చిన్న పిల్లలకు చెట్ల వేర్లను కాల్చి నూనెతో పుండ్లకు రాస్తున్నారు. వైద్యం కోసం చిరుతానుపాడు ఆదివాసీలు ఎదురుచూస్తున్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' పాల్వంచ మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిరుతానుపాడు విజిట్ చేయగా విషయం వెలుగుచూసింది.

పాల్వంచ మండల కేంద్రానికి 30కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతం చిరుతానుపాడులో ఆదివాసీలు నివసిస్తున్నారు. ఈ వర్షాకాలం మరింత అధ్వానమైన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వాగులు, వర్రెలు దాటి వెళ్లాల్సిందే. సుమారు నాలుగు కిలోమీటర్లు అడవిలో నుంచి చిరుతానుపాడుకు చేరుకోవాల్సి ఉంటుంది. రోడ్డు సౌకర్యం కాదు.. విద్యుత్ సౌకర్యం కూడా ఇక్కడ లేని దుస్థితి. అనారోగ్యానికి గురైన వారు బయట ప్రాంతానికి వెళ్లి వైద్యం చేయించుకోలేక నాటువైద్యం పైనే ఆధారపడి ఉంటున్నారు.

రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు

ఆ కుగ్రామానికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు కాలినడకనే, వర్రెలు, వాగులు దాటుకుంటూ అటవీ మార్గంలో రోడ్డు సౌకర్యం లేక తిప్పలు పడుకుంటు వెళ్లాల్సిందే. ఈ వర్షాకాలం ఆ గ్రామం వైపునకు అధికారులు కన్నెత్తి చూడరు. 25ఏళ్లుగా కనీస సౌకర్యాలు లేవు. విద్యుత్‌తోపాటు తాగునీటిసౌకర్యం లేకపోవడంతో అక్కడి ఆదివాసీల గోడు ఎవరు వినిపించుకునే పరిస్థితి లేకుండపోయింది.



అటవీ ప్రాంతంలోని చిరుతానుపాడు గ్రామం

మూలుగుతున్న ఆదివాసీలు

ఈ సీజన్‌లో చిరుతానుపాడులో ఇంటికొకరు జ్వరం, ఒళ్లునొప్పులు, తలనొప్పులతో మంచం పట్టారు. పద్దం దేవయ్య, మడవి జ్యోతి, మాడె మంగమ్మ, మూకమ్మలు లేవలేని పరిస్థితిలో ఉన్నారు. వీరిని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉల్వనూరు ప్రాథమిక వైద్యశాలకు తీసుకెళ్లేందుకు అవకాశం లేకుంగా ఉంది. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో మూలుగుతున్నారు. వైద్యం కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. చిరుతానుపాడులో తాగునీరు సమస్య ఉండటంతో సమీపంలోని వాగులోని నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. దోమల బెడదతో అల్లాడుతున్నారు. విద్యుత్ సౌకర్యం లేక ఆ ఆదివాసీలు చిమ్మనిచీకటిలో ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని బతుకు సాగిస్తోన్నారు.

చిన్నారుల పరిస్థితి హృదయ విదారం...

చిరుతానుపాడులోని చిన్నారుల పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. ఐదు సంవత్సరాల్లోపు ఉన్న పిల్లలకు అంతుపట్టని పుండ్లు ఉండటంతో ఆ తల్లిదండ్రులు చెట్ల వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. ఐదేళ్ల వయస్సున్న మహేష్, లక్ష్మి, మడివి సురేష్, మరో ఐదుగురు చిన్నారులకు ఒంటినిండా పుండ్లతో అల్లాడుతున్నారు. వీరికి చెట్ల వేర్లను కాల్చి కొబ్బరినూనెలో కలిపి పుండ్లకు రాస్తున్నారు. ఈ వైద్యం వల్ల కొంత ఉపశమనం కలుగుతుందని వారి నమ్మకం. కొంత మంది మహిళలు కీళ్ల వాపులకు జీడిగింజలు కాల్చి పెట్టుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

వైద్యం కోసం ఎదురుచూపులు..

చిరుతానుపాడు ఆదివాసీలు వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. జ్వరాలతో బాధపడుతూ మంచంపట్టిన వారికి వైద్య సహాయం అందించాలని కోరుతున్నారు. చిన్న పిల్లలకు సైతం సరైన వైద్యం అందించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



చిరుతానుపాడుకు వెళ్లే దారి

చదువులు సాగేదెట్లా..?

- » బదిలీల పుణ్యం..బోధనలు శూన్యం
- » మూడు ఉన్నత పాఠశాలల్లో వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- » 10వ తరగతి బోధనపై నీలినీడలు



మూడు రోజుల క్రితం ఉపాధ్యాయుల కోసం ఆందోళనకు దిగిన విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, జూలై 16: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాక విద్యార్థుల భవితపై దృష్టిసారించలేదు. బదిలీపై వెళ్లిపోయిన పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించడంలో విఫలమైంది. అశ్వారావుపేట మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో గుమ్మడివల్లి, నారాయణపురం, మామిళ్లవారిగూడెం పూర్తిగా గిరిజన ప్రాంతంలో ఉండేవే. పైన తెలిపిన మూడు పాఠశాలలు ఏటా పదో తరగతి ఫలితాల్లో తమ ప్రతిభను కనబరుస్తూనే ఉంటాయి. ఒకటి రెండు పోస్టులు ఖాళాగా ఉన్నా ఉన్న ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేసి ఫలితాలను సాధిస్తున్నారు. అయితే తాజాగా జరిగిన బదిలీల పుణ్యమా అని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులే లేకుండా పోయారు.

గుమ్మడివల్లి ఉన్నత పాఠశాలలో 6వతరగతి నుంచి 10వ తరగతి వరకు 135మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ 8 ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. గతంలో ఇక్కడ 7గురు ఉపాధ్యాయులు పనిచేశారు. తాజాగా జరిగిన ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న 7గురు ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు బదిలీ కాగా ఇక్కడకు మాత్రం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే వచ్చారు. వచ్చిన ఉపాధ్యాయుల్లో ఒకరు గణితం మరొకరు ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులు. వీరిలో ఒకరు హెచ్ఎం. దీంతో మరో ఆరుగురు ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఇది కాంప్లెక్స్ కావటంతో హెచ్ఎంకు దాదాపు 15 పాఠశాలను పర్యవేక్షించే బాధ్యత ఉంది. అంటే ఒకరు బయటకు వెళ్లి మరొకరు మాత్రమే బోధన చేస్తున్నారు.

● నారాయణపురం ఉన్నత పాఠశాలలో 115మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ మొత్తం 9 మంది ఉపాధ్యాయులు ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. గతంలో ఇక్కడ ఏడుగురు ఉపాధ్యాయులతో బోధన సాగగా బదిలీల పుణ్యమా అని ముగ్గురు మాత్రమే బోధకులు ఉన్నారు. ఇక్కడ గత పదేళ్లుగా సోషల్, తెలుగు బోధించే ఉపాధ్యాయులే లేరు. తాజాగా జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాల నుంచి ఈసబ్జెక్టులు బోధించే వారు రాగా బయాలజీ, ఆంగ్లం, గణితం, ఫిజిక్స్‌వంటి ప్రధాన సబ్జెక్టులు బోధించే వారే లేకుండా పోయారు. ఇక పాఠశాల హెచ్ఎం కూడా తన కాంప్లెక్స్‌లోని 17 పాఠశాలలను నిత్యం పర్యవేక్షించాలి.

● మామిళ్లవారిగూడెం ఉన్నత పాఠశాలలో 156మంది విద్యార్థులు ఉండగా 51 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 9 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఆరుగురు మాత్రమే ఉన్నారు. ఇంగ్లీషు, సోషల్ బోధించే వారే లేకుండా పోయారు.

రోడ్డెక్కిన విద్యార్థులు

తమ భవిష్యత్తు నాశనం కాకుండా తమకు పాఠాలు చెప్పేందుకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను కేటాయించాలంటూ ఇప్పటికే గుమ్మడివల్లి ఉన్న పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. అయినా ఇప్పటివరకు పూర్తస్థాయిలో ఉపాధ్యాయులను నియమించలేదు. గ్రామస్తులు రెండు రోజుల క్రితం జిల్లా అధికారులను కూడా కలిసి సమస్యను విన్నవించినట్లుగా తెలిసింది.

రజకుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

» సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి

ఏన్కూరు, జూలై16: రజకుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ విమర్శించారు. మంగళవారం సాయిఠాగూర్ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా సమవేశం మంకెన కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రజకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో రజకులపై దాడులు చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. రజకులను ఎస్టీలో చేర్చడానికి కేంద్ర ప్రభుత్వానికి అవసరమైన నివేదికలు అందించాలని కోరారు. రజకులకు సాంఘిక భద్రత, రక్షణ చట్టాన్ని తక్షణమే అమలుచేయాలనిల 50 ఏళ్లు నిండిన రజుకలకు పెన్షన్ ఇవ్వాలన్నారు. రజక ఫెడరేషనర్‌కు పాలక మండలిని నియమించి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దోబీఘాట్, కమ్యూనిటీహాల్, దేవుడి మాన్యాలు, చెరవులు,కుంటలకు రక్షణ కలిపించి తగు సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు ఈసమావేశంలో నిమ్మటూరి రామకృష్ణ నెరేళ్ల రమేష్, పగిళ్ల జోజి, అల్లాడి కృష్ణ, బీరెల్లి కృష్ణ, సరోజ గోరుగంటి కృష్ణ నాగేశ్వరరావు, రామారావు, నిమ్మ గడ్డ శ్రీకాంత్, హుస్సేన్, వెంకటప్పయ్య, కృష్ణ, వెంకన్న, అంజి అప్పయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణ

సామాజిక తనిఖీల్లో వెలుగులోకి అవకతవకలు

కరకగూడెం, జూలై 16: మండలంలోని 16 ఉపాధి హామీ పథకం, అటవీ శాఖలో నందు 1-4-2023 నుంచి 31-3-2024 వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీల్లో అవకతవకలపై వివిధ శాఖల అధికారులను జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో రవి నిలదీశారు. మంగళవారం భట్టుపల్లిలోని రైతు వేదికలో మండలంలోని 16 గ్రామ పంచాయితీలలో ఇటీవల బీఆర్‌పీలు నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికను జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో రవి, డిస్టిక్ విజిలెన్స్ అధికారి రమణరావు, అంబుట్స్ మెంట్ అధికారి నాగ ప్రకాశ్, క్వాల్టి కంట్రోల్ ఏఈ అనిల్ కమార్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అనుషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 16 పంచాయితీలలో రూ, 23091016 కోట్ల నిధులకు జరిగిన పనులపై పంచాయితీలలో జరిగిన అవకతవకలపై పంచాయితీ అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా మండలంలోని 16 పంచాయితీలలో మొత్తం పెనాల్టీ రూ, 30 వేలు, రూ, 50వేలు రికవారీ చేయాలని అధికారులను ఆదేశించారు. మరోసారి ఇలాంటి తప్పిదాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్, ఏపీవో శ్రీను, ఎంపీపీ రేగా కాళిక, 16 పంచాయితీల కార్యదర్శులు. టీఏలు, ఉపాధిహామీ మేట్‌లు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల ముగింపు సభలో మాట్లాడుతున్న తమ్మినేని

బీజేపీని ఓడించటమే సీపీఎం లక్ష్యం

» రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఆశించిన స్థాయిలో లేదు

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మధిరరూరల్, జూలై 16: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక ఎంపీ స్థానాలు గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మార్చటమే లక్ష్యంగా పెట్టుకుందని, బీజేపీని ఓడించటమే సీపీఎం ప్రధాన లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మధిరలో మూడురోజులుగా జరుగుతున్న సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సభలో మంగళవారం ఆయన ప్రసంగించారు. బీజేపీకి వ్యతిరేకంగా సాంస్కృతిక సామాజిక రంగంలో కూడా క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించాలన్నారు. రైతులకు రూ.రెండులక్షల రుణమాఫీలో కాంగ్రెస్ కొర్రీలు పెడుతుందని ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతుల్లో సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, బుగ్గవీటి సరళ, కల్యాణం వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు, చింతలచెర్వు కోటేశ్వరరావు, నాయకులు శీలం నర్సింహారావు, మందా సైదులు, టి.రాధాకృష్ణ, రాంనర్సయ్య పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

» రీజినల్ మేనేజర్ సరిరాం

ఇల్లెందు, జూలై 16: గురు పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల కోసం తమిళనాడులోని అరుణాచలం పుణ్య క్షేత్రాకిని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం తెలిపారు. జూలై 19 సాయంత్రం 7 గంటలకు ఖమ్మం నుంచి బయలుదేరి 22 సాయంత్రం తిరిగి ఈ సర్వీసు ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యాలు కలుగకుండా పుష్ బ్యాక్ సూపర్‌లగ్జరీ బస్సులను ఖమ్మం, భద్రాచలం కేంద్రాల నుంచి ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఈ సందర్భంగా కాణిపాకం, వేలేరు గోల్డెన్ టెంపుల్ దర్శనాల సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు రానుపోనూ చార్జీ రూ. 4120, గా నిర్ణయించామని, రాయితీలు, ఉచితాలు వర్తించవని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు మూడు పుణ్యక్షేత్రాల దర్శనం కొనం ఆర్టీసీ ఏర్పాటు చేసిన స్పెషల్ బస్సులసౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలి

» టీడీపీ నేతల డిమాండ్

ఖమ్మం మామిళ్లగూడెం, జూలై 16: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 9నెలలు అయినా ఇంతవరకు రుణమాఫీ ఊసే ఎత్తడం లేదని, రుణమాఫీ ఎగవేతకు చేయకుండా మార్గదర్శకాల పేరుతో సాకులను వెతుకుతున్నారని జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కొండబాల కరుణాకర్, ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు ఆరోపించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా రాష్ట్రంలో ఎక్కడా రేషన్ కార్డులు ఇవ్వడం జరగలేదని తెలుసు అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రేషన్ కార్డ్ అంటే రైతులు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. వ్యయసాయ సీజన్ మొదలై రెండు నెలలు కావస్తుందని, ఉన్న రుణం మాఫీ చేయలేదని, బ్యాంకులు కొత్తరుణాలు ఇవ్వడంలేదని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం వారం రోజులలో మొత్తం రైతు రుణాలను ఎటువంటి నిబందనలు లేకుండా రద్దుచేసి, ఈ నెలాఖరు లోగా రైతులు అందరికీ తిరిగి రుణాలు ఇవ్వాలని తెలుగుదేశంపార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో మహిళా అధికార ప్రతినిధి చుండూరు రాజరాజేశ్వరి, గుడిపుడి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు దామా శ్రీనివాసరావు, పాలడుగు కృష్ణ ప్రసాద్, చింతనిప్పు నాగేశ్వరావు, దొడ్డ కృష్ణారావు, కర్నాటి సీతారాములు, అశ్వని కుమార్, నాగండ్ల లక్ష్మణ్, కన్నేటి పృథ్వి, కొలికొండ మురళీ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

రైతు రుణమాఫీ భేషరుతుగా అమలు చేయాలి

» మార్గదర్శకాలను సవరించాలి

» టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు



ఖమ్మం సంక్షేమవిభాగం, జూలై 16: రైతు రుణమాఫీని భేషరుతుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, ఆర్థిక భారం తగ్గించుకునేందుకు రైతు రుణమాఫీకి కొర్రీలను పెట్టే విదంగా మార్గదర్శ కాలు రూపొందిస్తున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, షరతులు పెట్టలేదని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొంతమంది రైతులకే రుణమాఫీ అమలు చేయటంతో తిరిగి అధికారంలోకి రాలేదని, రైతుల ఆగ్రహాన్ని సవిచూసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా రైతు రుణమాఫీ అమలు చేసి చిత్తశుద్ధిని రైతుల మన్ననలు పొందాలని సలహా ఇచ్చారు.

ఏజెన్సీ ప్రాంతాలకు సీతారామ జలాలు అందాలి

న్యూడెమొక్రసీ పార్టీల సదస్సు డిమాండ్

ఇల్లెందు, జూలై 16: భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు జలాలు అందించకుండా మైదాన ప్రాంతాలకు నాగార్జున సాగర్ జలాలలు పారుతున్న భూములకు గోదావరి జలాలను మళ్లించడం ఏ మాత్రం సమంజసం కాదని న్యూ డెమొక్రసీ పార్టీల సదస్సు డిమాండ్ చేసింది. మంగళవారం పట్టణంలో న్యూ డెమొక్రసీ నాయకులు మోకాళ్ల రమేష్, భట్టు ప్రసాద్‌ల అధ్యక్షతన జరిగిన సదస్సులో తెలంగాణ జల సాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్ మాట్లాడారు. నాగార్జున సాగర్ ఆయకట్టు కలిగిన భూముల సాగుకే సీతారామ జలాలను మళ్లించడం చాలా దుర్మార్గమన్నారు. సీతారామ ప్రాజెక్టు జలాలు మన్యం ప్రాంతాలకు రాకుండా రాజకీయ నాయకులే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన స్ఫూర్తితోనే ఉద్యమానికి పురిటిగడ్డగా మారిన భద్రాద్రి జిల్లా ప్రజలు రైతులు సాగు నీటి సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలన్నారు. ఈ సదస్సులో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి. కోటేశ్వరరావు, ఎన్డీ నాయకుడు గౌని ఐలయ్య తదితరులు ప్రసంగించారు. అంతకుముందు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి తరలి వచ్చిన రైతులు ఎన్డీ శ్రేణులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఎన్డీ రాష్ట్రనాయకులు ఆవునూరి మధు, సాగర్, రాసుద్దీన్, సారంగపాణి, తుపాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఇల్లెందులో ఎన్డీ ప్రదర్శన

త్వరలో నాగపూర్-అమరావతి హైవే పనులకు శ్రీకారం

ఖమ్మం, జూలై 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): త్వరలో ప్రారంభం కాబోతున్న నాగపూర్-అమరావతి జాతీయ రహదారి పనులను వేగవంతంగా చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఖమ్మంరూరల్ మండలం సాయిగణేష్‌నగర్‌లో ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసింది. నేషనల్ హైవేఅథారిటీ కింద ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ల కింద ఖమ్మం, వరంగల్ పనులకు ఒక యూనిట్, ఖమ్మం, అమరావతి పనులకు ఒక యూనిట్ ఏర్పాటు చేశారు. ఇద్దరు ప్రాజెక్టు జనరల్ మేనేజర్లతో ఇంజనీరింగ్ అధికారులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాపింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఖమ్మం, వరంగల్ జిల్లాల పరిధిలో నాగపూర్-అమరావతి రహదారికి రూ.2832 కోట్లు మంజూరయ్యాయి. మొత్తం 200 కిమీ పరిధిలో నాలుగులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించబోతున్నారు. ఖమ్మం జిల్లా పరిధిలో 432 హెక్టార్ల వరకు భూసేకరణ జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 250ఎకరాలు మాత్రమే భూసేకరణ చేశారు. మిగతా భూసేకరణ చేపడుతున్నారు. అలాగే వరంగల్ జిల్లాలో కూడా భూసేకరణ చేపట్టాల్సి ఉంది. అమరావతి-నాగపూర్ రహదారి పొడవు సుమారు 660కిమీ వరకు ఉంది. రూ.14,670కోట్లతో ఈ రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో 660నుంచి 420కిమీ దూరం తగ్గనుంది. ఏపీలోని పలు పోర్టుల నుంచి నాగపూర్‌కు సరుకు రవానా త్వరితగతిన జరగనుంది మహారాష్ట్ర, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ నిర్మించే ఈ రహదారి ద్వారా ఓడరేవులు అనుసంధానం కాబోతున్నాయి. కాకినాడ, బందర్, విశాఖ, కృష్ణపట్నం ఓడరేవులకు వెళ్లే ఈ జాతీయ రహదారి ఖమ్మం సమీపంలోని చింతకాని వద్ద ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుసంధానం అవుతుంది. ప్రస్తుతం ఖమ్మం-దేవరపల్లి పనులు వేగంగా సాగుతున్నాయి. ఏడాదిలోగా ఈ రహదారి పూర్తి చేయనున్నారు. ఖమ్మం-కోదాడ హైవే పనులు వచ్చేనెలలో పూర్తి కానున్నాయి. ఖమ్మం మమతారోడ్డులో ఉన్న నేషనల్ హైవే అథారిటీ కార్యాలయం ప్రాజెక్ట్ ఇంప్లిమేంటేషన్ యూనిట్ నుంచి ఖమ్మం-కోదాడ పనులు పర్యవేక్షిస్తున్నారు. గతంలో నాగపూర్-అమరావతి హైవే పనులు కూడా వీరి పర్యవేక్షణలోనే సాగాయి. అయితే పనులు వేగవంతంగా చేసేందుకు అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేసి ఖమ్మంరూరల్ మండలం సాయిగణేష్‌నగర్‌లో ప్రత్యేకంగా నేషనల్ హైవే అథారిటీ కార్యాలయం ఏర్పాటు చేశారు ఈ వర్షాకాలంలోగా భూసేకరణ జరిగితే నవంబరు నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



మిషన్ భగీరథ నల్లాల పేరిట

నిధుల స్వాహా

- కదులుతున్న అక్రమ ఇంటింటి నల్లాల చిట్టా
- ఎనిమిది వందల నల్లాలు అదనంగా చేరిక
- సరిచేసేందుకు యత్నిస్తున్న అధికారులు
- వేయని నల్లాల పేరిట రూ.36లక్షలు స్వాహా?

దుమ్ముగూడెం, జూలై 16: మండలంలో చేపట్టిన మిషన్ భగీరథ ఇంటింటి నల్లాల సర్వేలో పెద్ద ఎత్తున అవతకతవకలు బైటపడుతున్నాయి. సర్వే కొనసాగుతోండగా, ప్రస్తుతానికి సుమారు 800 నల్లాలను వేయకుండా వేసినట్లు పంచాయతీ కార్యదర్శుల యాప్‌లో అప్‌లోడ్ జరిగినట్లు తెలుస్తోంది. కొందరు మిషన్ భగీరథ అధికారులు ఇంటింటి నల్లాల సర్వే యాప్‌లో సాంకేతిక లోపాలను అవకాశంగా తీసుకొని కొందరు పంచాయతీ వర్కర్లను ప్రలోభ పెట్టి ఈ తతంగం నడిపించారు. తమ ప్రమేయం లేకుండా అదనంగా చేర్చిన నల్లాలను గుర్తించిన పంచాయతీ కార్యదర్శులు సంబంధిత నివేదికలను ఎంపీడీవోకు మంగళవారం సమర్పించారు. ఐతే ఒక్క ప్రగళ్లపల్లి గ్రామపంచాయతీలోనే రెండు వందల నల్లాలను, మరో ఏడు పంచాయతీల్లో కలిపి ఆరు వందల నల్లాలను అదనంగా చేర్చినట్లు సమాచారం. ఉదాహరణకు మారాయిగూడెం గ్రామపంచాయతీ పత్తిపాకలో వందశాతం నల్లాలు వేశామని భగీరథ అధికారుల నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోండగా, అక్కడ ఇరవై నుంచి ముప్పై ఇళ్లకు మాత్రమే నల్లాలు వేశారు. గతంలో తాము చేసిన ఇంటింటి నల్లాల ఎంబీ రికార్డులను సరిచేసుకోడానికి కొందరు మిషన్ భగీరథ అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తోండగా, పంచాయతీ కార్యదర్శులు మాత్రం ససేమిరా అంటున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వేయకుండా వేసినట్లు చూపిన నల్లాలను ఎలా చూపించాలని వారు ప్రశ్నించారు. ఇప్పటికే వేయకుండా వేసినట్లు ఎంబీ రికార్డులో చూపించిన 800 నల్లాలకు గాను సుమారు రూ.36లక్షల భగీరథ నిధులు స్వాహా జరిగినట్లు కనబడుతోంది. పూర్తిస్థాయి విచారణ జరిపితే పంచాయతీల పరిధిలో ట్యాంకుల నిర్మాణం, పైపులైను పనుల్లోనూ రూ.లక్షలాది కుంభకోణం బయటపడే అవకాశం ఉందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవోను వివరణ కోరగా, ఈనెల 18 వరకు సర్వేలోని అన్ని విషయాలు తెలుస్తాయన్నారు.

ఆదాయపు పన్ను ఎగవేతదారులపై చర్యలు

- ఆదాయపు పన్ను అధికారి ఉమామహేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వర్

ఖమ్మం కలెక్టరేట్ జూలై 16: ఆదాయ పన్ను ఎగవేతదారులపై చర్యలుంటాయని ఖమ్మం ఆదాయ పన్ను అధికారి ఉమామహేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీడీవోలకు ఆదాయ పన్ను రిటర్న్స్ దాఖలుపై నిర్వహించిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వానికి ఆదాయపన్ను ముఖ్య ఆదాయ వనరులని, ఆదాయపన్ను కింద వసూలయ్యే ప్రతి పైసా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కోసం ఖర్చవుతుందన్నారు. వేతన ఆదాయం కోసం ఫారం 24క్యూ, వేతనేతర ఆదాయం కోసం ఫారం 26క్యూ లో టీడీఎస్‌లు సమర్పించాలన్నారు. డీడీవోలు క్రిడెన్షియల్‌ను రహస్యంగా ఉంచాలని, ఎవ్వరికీ షేర్ చేయవద్దని సూచించారు. బోగస్ పత్రాలతో ఆదాయ పన్ను ఎగవేతదారులపై ప్రాసిక్యూషన్‌తో పాటు, పెనాల్టీ అధిక మొత్తంలో ఉంటుందని, వీటితో పాటు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆదాయపన్ను రిటర్న్స్ ఫారం 16ను జూన్ 15 లోగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా డీడీవోలకు ఆదాయ పన్నుకు సంబంధించి రిటర్న్స్, త్రైమాసిక, వార్షిక రిటర్న్స్ ఎప్పుడు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదాయపన్ను అధికారి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పార్టీ జిల్లా అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు ..?

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై16: ఓ జాతీయ పార్టీకి చెందిన భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిపై కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు మంగళవారం ప్రచారం జరిగింది. ఇటీవల పార్టీ సమావేశంలో తమ సమస్యలు పరిష్కరించాలని అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన నాయకులు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిని వేడుకున్నారు. ఈ క్రమంలో ఆగ్రహించిన అధ్యక్షుడు మీరు గిరిజనులంటూ దురుసుగా మాట్లాడుతూ, ఆగ్రహం వ్యక్తం చేసినట్లు బాధితులు ఆరోపించారు. దీంతో కొంతమంది నాయకులు జిల్లా అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అందుబాటులో లేకపోవడంతో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌ను వివరణ కోరగా, గతంలో జిల్లా అధ్యక్షుడిపై వచ్చిన ఫిర్యాదు వాస్తవమేనని.ఆ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నూతన మాస్టర్‌ప్లాన్ కోసం

ఎదురు చూపులు



- ముసాయిదా సిద్ధమైనా.. ప్రభుత్వ అనుమతి పెండింగ్
- నిర్మాణదారులకు అనుమతులు లేవు
- భారీగా ఆదాయం కోల్పోతున్న నగరపాలకసంస్థ

ఖమ్మంకార్పొరేషన్, జూలై16: నగరపాలకసంస్థ పరిధిలోని గోపాలపురం సమీపంలో ఒక వ్యక్తికి ప్లాటు ఉంది. దానికి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేశారు. నగరపాలక సంస్థ అధికారులు విచారణ చేసి, రెండోదఫా ఫీజు కూడా తీసుకున్నారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. అయితే సదరు వ్యక్తి తన ప్లాటులో నిర్మాణానికి దరఖాస్తు చేయగా, సదరు ప్లాటు మధ్య నుంచి 80అడుగుల రహదారి పోతున్నట్లు ప్రస్తుత మాస్టర్‌ప్లాన్‌లో ఉందని, అందుకే నిర్మాణ అనుమతులు ఇవ్వలేమని అధికారులు పేర్కొన్నారు. అలాగే మరొక వ్యక్తి నివాసం నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే, ఆ వ్యక్తి స్థలం ప్రస్తుతం ఉన్న మాస్టర్‌ప్లాన్ ప్రకారం వాణిజ్యప్రాంతం పరిధిలోకి వస్తుందని అధికారులు అంటున్నారు. ఇది ఒక్కరి సమస్యే కాదు. వేలాది మంది ఇలా నిర్మాణ అనుమతులు రాక ఆందోళన చెందుతున్నారు. నూతన మాస్టర్‌ప్లాన్ లేకపోవడం వల్ల వచ్చిన ఇబ్బంది ఇదీ. దీనివల్ల నగరపాలక సంస్థ భారీగా ఆదాయం కోల్పోతున్నది.

ముసాయిదా సిద్ధమైనా

స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలో ఖమ్మం నగరపాలక సంస్థతో పాటు ఖమ్మం, వైరా, మధిర, పాలేరు నియోజకవర్గాలు ఉన్నాయి. సుడా పరిధిలో నూతన మాస్టర్‌ప్లాన్ ముసాయిదాను సిద్ధం చేశారు. సదరు ముసాయిదాను గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అనుమతి కోసం పంపారు. అయితే కొన్ని నగరపాలక సంస్థలకు చెందిన నూతన మాస్టర్ ప్లాన్‌లపై గొడవలు కావడంతో సుడా మాస్టర్‌ప్లాన్‌ను పెండింగ్‌లో ఉంచారు. గతంలోనే అందరి అన్ని విభాగాల అధికారులతో సమావేశాలు నిర్వహించడమే కాకుండా ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను తీసుకొని, ముసాయిదా రూపొందించారు. ముసాయిదాను ఆమెదిస్తే ఇక మాస్టర్‌ప్లాన్ వచ్చినట్లే..

ఏడాదిగా పెండింగ్

నూతన మాస్టర్ ప్లాన్ అనుమతి ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరపాలక సంస్థ పాలకవర్గం నూతన మాస్టర్‌ప్లాన్‌పై దృష్టి పెట్టడం లేదు. ప్రస్తుతం సుడా ఛైర్మన్, సలహాసంఘం సభ్యులు కూడా లేరు. దీంతో పెండింగ్‌లో ఉన్న నూతన మాస్టర్‌ప్లాన్ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేవారు లేకుండా పోయారు. ప్రస్తుతం పాత మాస్టర్‌ప్లాన్‌నే అమలు చేయడంతో, అనుమతుల కోసం వేలాదిమంది ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తులు తిరస్కరించడంతో నగరపాలక సంస్థ కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోయింది. కౌన్సిల్ సమావేశం నిర్వహించి, నూతన మాస్టర్‌ప్లాన్ అనుమతికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నగదు ఇవ్వాలని బెదిరింపులు

- ముగ్గురు విలేకరులపై కేసు నమోదు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై16: ఓ వ్యక్తిని తాము విలేకరులమంటూ బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కొత్తగూడెం పట్టణంలోని బర్లిఫీట్ ఏరియాకు చెందిన దాసరి కార్తీక్ తల్లి దాసరి పూర్ణను తన భర్త దాడి చేయడంతో మృతి చెందింది. కాగా సోమవారం రాత్రి ఆమె అంత్య క్రియలు జరిగాయి. ఈ క్రమంలో గుర్తు తెలియని ఫోన్ నెంబర్ నుంచి మృతురాలి కుమారుడు దాసరి కార్తీక్ ఫోన్‌కు ఐదు సార్లు ఫోన్ వచ్చింది. కార్యక్రమాలు అనంతరం తిరిగి కార్తీక్ ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా, నేను విలేకరిని అని, నా పేరు శ్రీనివాస్ అని పరిచయం చేసుకున్నాడు. మీ తల్లి మృతి చెందడానికి గల కారణం, మీ నాన్నకు ఉన్న వివాహేతర సంబంధం వంటి విషయాలను, పేపర్‌లో వార్తగా రాయకుండా ఉండాలంటే మాకు కొంత నగదు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా మేము చెప్పినట్లు వినాలని బెదిరింపులకు పాల్పడ్డారు. లేని పక్షంలో మీ కుటుంబం పరువు పోతుందని ఫోన్ పెట్టేశాడు. కొద్ది సమయం అనంతరం మృతురాలి ఇంటికి ముగ్గురు విలేకర్లు వెళ్లి మా పేర్లు రమేష్, గణేష్, కృష్ణమూర్తి అంటూ పరిచయం చేసుకొని నగదును ఇవ్వమని బెదిరించారు. దీంతో మృతురాలి కుమారుడు కార్తీక్ నా దగ్గర నగదు లేదు, అని తేల్చి చెప్పడంతో వారు వెళ్లిపోయారు. ఈ సంఘటనపై బాధితుడు దాసరి కార్తీక్ కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు విలేకర్లు రమేష్, గణేష్, కృష్ణమూర్తిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి ఇంటికివచ్చి బెదిరించిన వారిని పోలీసులు ఇప్పటికే గుర్తించగా, బాధితుడితో ఫోన్‌లో మాట్లాడిన విలేకరి ఎవరంటూ ఆరా తీస్తున్నారు.

రూ.3వేల కోసం

అమ్మమ్మను చంపాడు

- గంజాయి మత్తులో ఓ యువకుడి ఘాతుకం
- ఖమ్మం నగరంలో ఘటన
- పోలీసుల అదుపులో యువకుడు

ఖమ్మంక్రైం, జూలై 16: చెడు వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు నిత్యం మత్తులో జోగుతూ అన్నం పెట్టి పెంచిన అమ్మమ్మనే దారుణంగా కొట్టిచంపాడు. మద్యం, గుట్కా, గంజాయికి బానిసై జులాయిగా తిరుగుతూ దారి తప్పాడు. అడిగిన డబ్బులు ఇవ్వలేని అమ్మమ్మను విచక్షణారహితంగా కొట్టి చంపాడు. ఆ తరువాత కాలుజారి పడిపోయిందని తప్పించుకునే ప్రయత్నం చేశారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం ఖమ్మం నగరానికి చెందిన అమరబోయిన రాంబాయమ్మ (80) కొన్నేళ్ల క్రితం తన భర్త విశ్వనాథం మృతిచెందడంతో రోటరీనగర్‌లో నివాసం ఉంటోంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒక కుమారుడు మృతి చెందాడు. మరో కుమారుడు గురవయ్య హైదరాబాదులోని ఓ కళాశాలలో ప్రైవేట్ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఆమె తన చిన్న బిడ్డ కుమారుడు ఉదయ్‌ని చిన్నప్పటి నుంచి తనవద్దే ఉంచుకొని చదివిస్తోంది. 10వ తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులతో పాసైన అతడు ఇంజనీరింగ్ చదివేటప్పుడు జల్సాలు చేస్తూ మద్యం, గంజాయికి బానిసై ఇంజనీరింగ్ మధ్యలోనే ఆపేశాడు. గంజాయికి బానిసైన ఉదయ్ పలుమార్లు స్థానికులతో కూడా గొడవలు పడేవాడు. నిత్యం గుట్కా నములుతూ స్థానికులను బెదిరిస్తూ అర్ధరాత్రి వరకు ఇంటికి రాకుండా డబ్బు కోసం అమ్మమ్మను వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన ఉదయ్ రూ.3వేలు కావాలని అమ్మమ్మను వేధించాడు. ఆమె తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో అప్పటికే మత్తులో ఉన్న ఉదయ్‌కుమార్ చేతులతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచాడు. దాంతో ఆమె కుప్పకూలిపోయింది. మంగళవారం తెల్లవారుజామున స్థానికులు ఇంటి వద్దకు రాగా ఆమె కాలుజారి మృతిచెందిందని నమ్మించే ప్రయత్నం చేశాడు. అయితే అతడి ప్రవర్తనతో అనుమానం వచ్చిన స్థానికులు అతడిని పట్టుకుని గట్టిగా నిలదీయడంతో తానే కొట్టి చంపినట్టు అంగీకరించాడు. దాంతో స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి ఉదయ్‌ను ఖమ్మం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. అనంతరం రాంబాయమ్మ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ విషయాన్ని పోలీసులు కుమారుడు గువరయ్యకు సమాచారం అందించడంతో అతడు ఖమ్మానికి చేరుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరిపై ఒకరి దాడి

- ఇరువురికి గాయాలు ● వేంసూరులో ఘటన

వేంసూరు, జూలై 16: ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మర్లపాడు సెంటర్లో చోటు చేసుకుంది. భీమవరం గ్రామానికి చెందిన నడ్డి రవి, బొల్లెపోగు సురేష్‌లు ఒకరిపై ఒకరు మంగళవారం మర్లపాడు సెంటర్లో రాళ్లు, కత్తులతో దాడులు చేసుకున్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇరువురు దాడులు చేసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. తీవ్రగాయాలైన వీరిని స్థానికులు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిపై ఎస్ఐ వీరప్రసాద్ విచారణ చేపట్టారు. ఒకరిపై ఒకరు కత్తులతో దాడులు చేసుకోవడంతో స్థానికులు భయభ్రాతులకు గురయ్యారు.

అత్యవసర సేవలను వినియోగించుకోవాలి

- అత్యవసర వైద్య సేవల జిల్లా ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ప్రణయ్‌కుమార్



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రణయ్‌కుమార్

జూలూరుపాడు, జూలై 16: ప్రభుత్వం ప్రజలకు అత్యవసర సేవలను అందుబాటులో ఉంచిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని అత్యవసర వైద్య సేవల జిల్లా ఎగ్జిక్యూటివ్ మేనేజర్ ఎ. ప్రణయ్ కుమార్ తెలిపారు. మంగళవారం జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. 108, 102 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 108 వాహనంలోని మాత్రలు, పరికరాలను పరిశీలించారు. సిబ్బంది పని తీరుని పరిశీలించి తగు సూచనలు చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు గాను 108 వాహనాలు 22, 102 వాహనాలు 19 టిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతినెల వాహనాలు. సిబ్బంది పనితీరుని తనిఖీ చేస్తామని అన్నారు. అత్యవసర సేవలను అందించడంతో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలపారు. కాలం చెల్లిన మందులను రోగులకు అందించవద్దని సూచించారు. 102 వాహనంలో గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రుల్లోని క్లినిక్‌ల వద్దకు తీసుకువచ్చి సేవలు అందివచాలని తెలిపారు. వర్షకాలంలో పాముకాట్లు, పురుగుమందు తాగిన వారి కేసులు అధికంగా వస్తున్నాయని అన్నారు. సిబ్బంది పనితీరుని మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంటి రవి, పైలట్ శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో క్రీడాకారిణుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి,

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 16: హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో ఈనెల 7న జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో నగరానికి చెందిన ఇద్దరు బాలికలు సత్తా చాటి పతకాలు సాధించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేసే క్రీడాకారిణులు భవిత 300 మీటర్ల పరుగు పోటీల్లో లాంగ్‌జంప్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించగా, లోహిత 100 మీటర్ల పరుగు పోటీలో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను డీవైఎస్‌వో సునిల్ రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి షఫీక్ అహ్మద్‌లతో పాటు పలువురు అభినందించారు. భవిష్యత్ జాతీయ, రాష్ట్ర పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 16: విజయవాడలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన కేంద్రీయ విద్యాలయ రీజినల్ ఆర్చరీ పోటీలలో నగరానికి చెందిన కొత్తపల్లి లక్ష్మీసహస్ర ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించింది. నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న సహస్ర నిత్యం సర్దార్ పటేల్ స్టేడియంలో సాధన చేస్తూ, ఇటీవల పలు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపుతూ పతకాలు సాధిస్తుంది. ఈ సందర్భంగా రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన సహస్రను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, కోచ్ నగేష్ అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిచారు.

ఆర్టీసీ వైద్యాధికారిగా సాయిసుష్మ



ఖమ్మంఖానాపురంహవేలి, జూలై16: ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ కార్మికులకు వైద్యసేవలందించేందుకు గాను సంస్థ డాక్టర్ సాయిసుష్మను నియమించింది. గతంలో ఇక్కడ పనిచేసిన డాక్టర్ గిరిసింహారావును సాధారణ బదిలీల్లో భాగంగా మహబూబ్‌నగర్ బదిలీ చేశారు. నూతనంగా విధుల్లో చేరిన సాయిసుష్మ నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన వెంటనే, ఆర్టీసీ వైద్యాధికారిగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు వారి కుటుంబ సభ్యులకు, సిబ్బందికి సమయానుకూలంగా వైద్యసేవలందిస్తానన్నారు. గతంలో పనిచేసిన గిరిసింహారావు 1993లో ఆర్టీసీ వైద్యాదికారిగా గిరిసింహారావు నియమితులై 31సంవత్సరాలు ఖమ్మంలోనే పనిచేశారు. ఈనెల 11న మహబూబ్‌నగర్ బదిలీపై వెళ్లారు.

15వ బెటాలియన్ కమాండెంట్‌గా ఛటర్జీ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఛటర్జీ

సత్తుపల్లిరూరల్, జూలై16: సత్తుపల్లి మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక బెటాలియన్ కమాండెంట్‌గా పీజేపీసీ.ఛటర్జీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన అదనపు కమాండెంట్ పీ.వెంకటరాములు కమాండెంట్ ఛటర్జీకి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన సాధారణ బదిలీల్లో భాగంగా డీజీపీ (టీజీ) ఆఫీస్ నుంచి సత్తుపల్లికి వచ్చారు. అనంతరం బెటాలియన్‌లో ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. బెటాలియన్ పోలీసులు, ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో సహాయ దళపతి ఎస్‌.రంగారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్ఐ రాజేందర్

కరకగూడెం, జూలై 16: మండలంలోని కరకగూడెం గ్రామానికి చెందిన రావుల సోమయ్య ముత్తారం గ్రామానికి చెందిన గోపి అనే ఇద్దరు వ్యక్తుల ఫోన్లు గతంలో పోగొట్టుకున్నారు. ఈ విషయంపై బాధితులు కరకగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఐఎంఈ నెంబర్ ద్వారా బాధితులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రాజేందర్ విచారణ చేపట్టి హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి, తాడ్వాయి మండలానికి చెందిన మరో వ్యక్తి నుంచి రెండు ఫోన్లు రికవరీ చేసి ఎస్ఐ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ముత్తారం గ్రామానికి చెందిన గోపికి చెందిన రూ.16వేలు విలువ గల ఫోన్, కరకగూడెం గ్రామానికి చెందిన రావుల సోమయ్య రూ.18 వేల విలువ గల ఫోన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది దుర్గారావు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటోను ఢీకొన్న కారు

- ముగ్గురికి గాయాలు

జూలూరుపాడు, జూలై 16: ట్రాలీ ఆటోను(అశోక్ లైల్యాండ్)ను కారు ఢీ కొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని సాయిరాం తండా గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మర్రిపేట బంగ్లా మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన నాగిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి ఇటీవల చనిపోవడంతో అస్తికలను గోదావరిలో కలిపేందుకు ట్రాలీ ఆటోలో కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి భద్రాచలం వెళుతున్నారు. ఈ క్రమంలో బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రవి, అతని స్నేహితులతో కలిసి కారులో కొత్తగూడెం నుంచి జూలూరుపాడు వైపు వస్తూ సాయిరాంతండా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను ఢీకొట్టారు. ఈ సంఘటనలో ట్రాలీ ఆటోలో ఉన్న నాగిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, అతని తల్లి పుల్లమ్మ, బి.రమక్కలకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, 108 సహాయంతో క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కానిస్టేబుల్ వాహనాన్ని నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

ప్రకటన

[illegible]

Dispute No : 48/2023

వెంకట తిరుమల చిట్ ఫండ్(ప్రై)లిమిటెడ్ నరసరావుపేట — Disputant

Vs

కందిమళ్ల పిచ్చయ్య మరియు ఇతరులు — opponents

Notice as per rule 50 of the A.P. Chit Fund Rules 2008

OPPONENT 1 : కందిమళ్ల పిచ్చయ్య S/o. వెంకటేశ్వర్లు, వయస్సు 40, సీనియర్ లెక్చరర్, C/o శారద ఎడ్యుకేషనల్ సొసైటీ, డి.నెం. 32-2-10/3ఎ బెంజిసర్కిల్ సెంటర్, మొగల్ రాజపురం, విజయవాడ (పో), ఎన్.టి.ఆర్. జిల్లా.

OPPONENT 2 : నాయుడు నాగరాజు, S/o. వీరభద్రనాయుడు, వయస్సు 41, సీనియర్ అసోసియేట్ C/o స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రిజియనల్-5, భాగ్యోదయ బిల్డింగ్స్, 2వ ఫ్లోర్, ప్యాట్నీ సర్కిల్, సికింద్రాబాద్ (పో), తెలంగాణ రాష్ట్రం.

OPPONENT 4 : జొన్నబోయిన సత్యనారాయణ S/o. కన్నయ్య, వయస్సు 55, సెకండరీ గ్రేడ్ టీచర్, ఎంపిపి స్కూల్, కొండకుడిమ (గ్రా), వైరా (పో) & (మం), ఖమ్మం జిల్లా, తెలంగాణా రాష్ట్రం

OPPONENT 5 : బొడ్డు రామకృష్ణ S/o. రంగయ్య, వయస్సు 38, సీనియర్ లెక్చరర్, C/o శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, బోర టప్పల్, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం.

పైన తెలియచేసిన Disputeకి సంబంధించి, వెంకట తిరుమల చిట్‌ఫండ్ కంపెనీవారు మీపై చిట్‌రిజిష్ట్రారు గారి కోర్టులో పైనంబరుపైన Dispute దాఖలు చేసి ఉన్నారు. అందుకు సంబంధించి ఎన్ని పర్యాయములు మీకు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందువలన పైనంబరు Disputeలో మీకు నోటీసులు జారీ కాగలందులకు గాను, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా ఆర్డరు చేసినారు. కావున మీరు ది.27-07-2024వ తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు నర్సరావుపేట చిట్‌రిజిస్ట్రార్ గారి కోర్టులో హాజరు అయ్యి మీకు గల అభ్యంతరములు స్వయంగా గాని, లేక న్యాయవాది ద్వారా గాని తెలియచేసుకొనగలరు. లేని యెడల మీపై ఏకపక్షంగా పై Dispute 48/2023 నందు తీర్మానం చేయబడునని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయటమైనది.

వాయిదా తేది : 27-07-2024

నర్సరావుపేట, పల్నాడు జిల్లా.

ఇట్లు : మేనేజరు / ఫోర్‌మెన్

వెంకట తిరుమల చిట్‌ఫండ్(ప్రై)లిమిటెడ్, నర్సరావుపేట.

అనారోగ్యంతో సీపీఎం నాయకుడు రాజేశ్వరరావు మృతి

- సంతాపం తెలిపిన మునిసిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు

ఇల్లెందు టౌన్, జూలై 16: ఇల్లెందు పట్టణంలోని 17వ వార్డుకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు లక్కా రాజేశ్వరరావు (70) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక సంవత్సరాలుగా సీపీఎం పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు. లక్కా రాజేశ్వరరావు మృతి పట్ల మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు నబీ, తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్‌కుమార్, ఆలేటి సంధ్య తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు పెండ్యాల హరికృష్ణ రూ.8వేలు అందజేశారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

మైనర్ విద్యార్థినిపై లైంగికదాడి

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఖమ్మంక్రైం, జూలై 16: మైనర్ విద్యార్థినిపై 20 ఏళ్ల బీటెక్ విద్యార్థి లైంగికదాడికి పాల్పడిన ఘటనపై మంగళవారం ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరానికి చెందిన ఓ విద్యార్థిని నగర శివారు ప్రాంతంలోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ఓ విద్యార్థి హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. వీరిద్దరికీ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని సోమవారం ఉదయం ఆ విద్యార్థిని సదరు యువకుడు నగరంలోని ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో, పోలీసులు సదరు విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం అతడిపై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతడితో పాటు లాడ్జి నిర్వాహకుడిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపారు.

ఇళ్ల మధ్యలో మురుగు

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



ఇళ్ల మధ్య నిలిచి ఉన్న మురుగునీరు

కూసుమంచి, జూలై 16: మండలంలోని నర్సింహులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని నానుతండాలో మురుగునీరు చెరువులా మారింది. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్యనే నిల్వ ఉంది. దీంతో దోమల సమస్య తీవ్రంగా మారి కంటిమీద కునుకు కరువైంది. తండాకు చెందిన ఒకరిద్దరు కుటుంబాలు రోడ్డు పక్కనుంచి మురుగునీరు వెళ్లే కాల్వను మట్టితో మూసివేయడంతో ఈపరిస్థితి తలెత్తింది.

డ్రైనేజీని నిర్మించకపోతే చస్తామని బెదిరింపులు..

తండాకు చెందిన ధావూ అనే వ్యక్తి మురుగు నిల్వపై ఎంపీవో రామచంద్రమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో పంచాయతీ సెక్రటరీతో కలిసి ఎక్స్‌కవేటర్‌తో మురుగునీరు తొలగించేందుకు ప్రయత్నించగా, పక్కనే ఉన్న పలు కుటుంబాల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాత్కాలికంగా కాల్వ తీసి మురుగు తొలగిస్తామని, నిధులు మంజూరు కాగానే డ్రైనేజీ తీస్తామని అధికారులు చెప్పినప్పటికీ వారు వినలేదు. పురుగుమందు డబ్బాలతో వచ్చి కాల్వ తీస్తే తాము బలవన్మరణానికి పాల్పడుతామని చెప్పడంతో, అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళతామని ఎంపీవో విలేకరులకు తెలిపారు.



అధికారులతో గొడవపడుతున్న మహిళలు

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

EDUCATION

BPT - 4 1/2 సం./ B.Sc. MLT 3 సం.లు/ డిప్లొమా ఇన్ MLT, Anesthesia, Radiographic Asst., Med. Imaging, O.T. Tech, Dialysis, CARDIOLOGY - 2 సం.లు కోర్సులు. అర్హత : ఇంటర్ Bi.P.C/Any Group - ASIAN COLLEGE, VIJAYAWADA. 76800 65835, 90636 15623.

AJB-194741

ఫర్నీచర్ అమ్మబడును

నల్లమద్ది కర్రతో తయారు చేయబడిన ఫర్నీచర్ బుక్‌షాప్స్, మరియు కిరాణా షాపులకు అనువుగా గల ఫర్నీచర్ అమ్మమునకు కలదు. కావలసినవారు సంప్ర॥ 97049 76971

AJM-187631

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు

4 Lines Classifieds 220/- Only Extra Line 45/- only

ఖమ్మం : 9985401672

ఖమ్మం 9985406151 9985401698

కొత్తగూడెం: 9985400885

భద్రాచలం: 9985411347

కోనో కార్పస్ మొక్కల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సత్తుపల్లి, జులై16: ఈనెల 3న 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రచురితమైన "ప్రజారోగ్యంపై కోనోకార్పస్ పంజా" కథనంపై ఎట్టకేలకు మునిసిపాలిటీ అధికారులు స్పందించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయం ఎదుట డివైడర్‌పై నాటిన మొక్కలను తొలగించడం ప్రారంభించారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రజలకు హానికరంగా, ప్రమాదకరంగా ఉన్న మొక్కలను తొలగిస్తున్నట్లు కమిషనర్ మందా రవిబాబు తెలిపారు.



రూ.30వేల విలువైన జ్యూట్ బ్యాగుల పంపిణీ



జ్యూట్ బ్యాగులు పంపిణీ చేసిన దృశ్యం

వైరా, జులై16: పర్యావరణ పరిరక్షణ(ప్లాస్టిక్ నివారణ)లో భాగంగా మంగళవారం వైరాలో గ్రేట్ విజన్‌క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో రూ.30వేల విలువైన జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. లగడపాటి చెంచయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు, కోడలైన ఆరోవార్డు కౌన్సిలర్ లక్ష్మీరాజ్యం అందించిన ఆర్థిక సాయంతో ఆరోవార్డుతో పాటు ఇతర ప్రాంతాల్లో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీరాజ్యంతోపాటు ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీరామనేని రామస్వామి, డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, లగడపాటి కృపావతి, ప్రభాకర్‌రావు, కాపా గోపాలరావు, జాలా పుల్లారావు, సూర్యదేవర శ్రీధర్, జీవీ.సూర్యప్రకాశరావు, సీహెచ్. వెంకటేశ్వరరావు, దేవభక్తిని రవీంద్ర, రామకృష్ణ, ఉప్పలయ్య పాల్గొన్నారు.

రేషన్ కార్డులు అందించాలి

ఖమ్మంరూరల్, జూలై16: అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు, పింఛన్లు వెంటనే అందించాలని మాస్‌లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎమ్ వెంకటాయపాలెంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో మలీదు నాగేశ్వరరావు, మారుతి మల్లయ్య, కుర్ర వెంకన్న, యాదగిరి, బండెల లలిత, రూప, సత్యవతి పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

తల్లాడ, జూలై16: మండలంలోవైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. మండలంలోని బాలపేట, అన్నారు గూడెం, గొల్లగూడెం, రెడ్డిగూడెం, కొత్తవెంకటగిరి, తెలగవరం, లక్ష్మీపురం గ్రామాల్లో నిర్వహించిన శిబిరాల్లో డాక్టర్లు శ్రీకాంత్, గోపి, మహేష్‌కుమార్, విజయ్, నూస్మా, హెల్త్‌సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వర్షాలకు చిత్తడిగా రహదారులు

- తామరచెరువు కట్టపై నడవలేని దుస్థితి
- నత్తనడకన గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు

సత్తుపల్లిరూరల్, జులై16: ఇటీవల కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారి, రాష్ట్రీయ రహదారి, అంతర్గత రోడ్లు, గ్రామీణ లింకురోడ్లు ఏవైనా కానీ చిత్తడిగా మారుతున్నాయి. మండలంలోని సదాశివునిపేట, కిష్టాపురం గ్రామాలలో నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు ఆలస్యంగా సాగుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించే క్రమంలో అండర్‌పాస్‌ల వద్ద రోడ్డు నిర్మాణం లేక రోడ్డు ఛిద్రమై గుంతలమయంగా మారాయి. పట్టణంలో పలుచోట్లా ఇటీవల తవ్వి నిర్లక్ష్యంగా పూడ్చిన గుంతల వద్ద బురద చేరుకోగా నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి అధికంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

వర్షాకాలంలో రోడ్డు నిర్మాణమా..

పట్టణంలోని తామర చెరువు కట్టపై ఇటీవల రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు.



తుంబూరులో రహదారిపైనే ప్రవహిస్తున్న మురుగు, తామర చెరువుకట్ట రహదారి, కాకర్లపల్లి రోడ్డు

దీంతో అటువైపు వెళ్లాలంటేనే నరకప్రాయంగా మారిందని వాహనదారులు, వాకర్స్ వాపోతున్నారు. ఇప్పటి వరకు ఉండి వర్షాలు పడే సమయంలో బీటీ నిర్మాణం ఎలా ప్రారంభించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగింపుగా ఉన్న కాకర్లపల్లిలో ఎదురవుతుంది. తుంబూరు గ్రామంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఇళ్ల ముంగిట పెద్ద పెద్ద ర్యాంపులు నిర్మించడంతో వరద నీరు రోడ్డుపైనే పారుతుందని, డ్రెయనేజీ నిర్మించాల్సిన అవసరం ఉంది. పట్టణ శివారులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నుంచి తమ్మిలేరు బ్రిడ్జి వరకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు విస్తరించి ఉన్నాయి. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా రోడ్డు మొత్తం చిత్తడిగా మారి ప్రమాదకరంగా తయారైందని, వెంటనే రహదారికి అనుకుని సీసీలు నిర్మించాలని, అప్పటివరకు షాపుల యజమానులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

పట్టింపు లేని ప్రజాపాలన

- స్థానికంగా ఉండని రఘునాథపాలెం ఎంపీడీవో
- ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో రోజుల తరబడి జాప్యం

రఘునాథపాలెం,జూలై16: పథకాల లబ్ధిదారులకు చేరాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులే కీలకం.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హత కలిగి పథకాలు అందకపోయిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన స్పెషల్ డ్రైవ్ పెట్టారు. అయితే రఘునాథ పాలెం ఎంపీడీవో స్థానికంగా ఉండకుండా ఇతర జిల్లాల నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనిచేసే ఉద్యోగులు కనీస విధులు నిర్వహించటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. సోమవారం ప్రజాపాలన దరఖాస్తులను అందించేందుకు పదుల సంఖ్యలో దరఖాస్తుదారులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. అయితే నెట్ రావటం లేదని సాకు చెప్పి తిప్పి వెనక్కి పంపారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరణ చేసేందుకు అధికారులు రాలేదు. దీంతో దరఖాస్తుదారులు ఖాళీ కుర్చీలను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు.



మధ్యాహ్నం వరకు కార్యాలయానికి రాని ఉద్యోగులు

వరదనీటికి దారేదీ?

- రోడ్డు ఎత్తు పెంచటంతో లోతట్టువాసుల ఇబ్బందులు
- కొణిజర్లలో డ్రెయినేజీ నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి



ఇళ్ల మధ్యలో వరదనీరు

కొణిజర్ల, జూలై16: కొణిజర్ల నుంచి బస్వాపురం క్రాస్‌రోడ్డు మీదుగా చింతకాని వరకు రోడ్డు విస్తరించారు. అయితే కొణిజర్ల నుంచి కిలోమీటరు పొడవున రోడ్డుకు ఇరువైపుల ఉన్న ప్రజలు రోడ్డు ఎత్తు పెరగటంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరదనీరు రోడ్డుదాటే పరిస్థితి లేదు. డ్రెయినేజీ లేకపోవటంతో వరద నీరు ఎటూవెళ్లే పరిస్థితి లేదు. ఫలితంగా ఇళ్లలోకి నీరు చేరుతుంది. ఈ నీటిని బయటకు పంపేందుకు నానా తంటాలు పడుతున్నారు. వర్షాలు పూర్తిగా పోయిన మూడు రోజులు వరకు నీరు ఇలాగే నిల్వ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే, మంత్రులను కలిసి తమ సమస్యను చెప్పుకునేందుకు బాధిత ప్రజలు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, ఏ వ్యాధులు వస్తాయోనని బయపడుతున్నామని అధికారులు, నేతలు తమ ఇబ్బందిని గుర్తించి రోడ్డుకిరువైపుల తమ ఇండ్లు ఉన్నతం వరకు డ్రైనేజీ నిర్మించి వరదనీరు రాకుండ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మధిర మునిసిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తం



మున్సిపల్ ఆఫీస్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మధిర, జూలై 16: మధిర మున్సిపాల్టీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉన్నాయని, పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడంలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. మంగళవారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు పాపట్ల రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా రెండు నెలలుగా పట్టణంలో పారిశుధ్య చర్యలు అస్తవ్యస్తంగా ఉన్నాయని నాయకులు విమర్శించారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించడంలేదన్నారు. అధికారులు స్పందించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ మేనేజర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, జిల్లాకార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ, మండల అధ్యక్షులు పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, రామిశెట్టి నాగేశ్వరరావు, డీవీఎన్ సోమేశ్వరరావు, మర్సకట్ల స్వర్ణాకర్, కాశీరావు, శ్రీహరి, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా బంజారాల శీత్లా పండుగ

మధిరరూరల్, జూలై16: మండల పరిధిలోని వంగవీడులో మంగళవారం బంజారాల శీత్లా పండుగను జరుపుకున్నారు. గ్రామంలోని గిరిజనులందరూ ఐక్యంగా సంబరాల్లో పాల్గొన్నారు. గ్రామ సరిహద్దులోని పొలిమేర కూడలి వద్ద శీత్లా భవానిని ప్రతిష్ఠించి గిరిజనులంతా బోనాలు సమర్పించారు. మేకలు, కోళ్లను కోసి వాటిపైనుంచి పశువులను దాటించారు. అలా చేయడం వలన అందరూ ఆరోగ్యంగా ఉండటంతో పాటు పంటలు బాగా పండుతాయని, అందరు సుభిక్షంగా ఉంటారని గిరిజనులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ గిరిజన పెద్దలు తండానాయక్, భూక్యా అచ్చానాయక్, భద్రునాయక్, జంబూనాయక్, సక్రు, పకీరా, డాక్టర్ రవిచంద్ పాల్గొన్నారు.

విశ్వనాథపల్లిలో వైద్యశిబిరం

కారేపల్లి జూలై16: మండల పరిధిలోని విశ్వనాథపల్లిలో మంగళవారం స్థానిక పల్లెదవాఖానలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో అనేకమంది ప్రజలు బారిన పడటంతో మండల వైద్యులు శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సురేష్, సీహెచ్‌వో భద్రయ్య, స్థానిక పల్లెదవాఖాన వైద్యులు మహేశ్వరి, ఏఎన్ఎంలు అంజలి, కృష్ణవేణి,నాగమణి, సంధ్యరాణి పాల్గొన్నారు.

కారేపల్లిలో చెత్త తొలగింపు

కారేపల్లి, జూలై16: మండల కేంద్రంలో డ్రెయినేజీల్లో చెత్త తొలగిస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన రోడ్డుపై నీరుచేరి ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిపై పంచాయతీ 10వ వార్డు మాజీ సభ్యుడు గౌస్‌ఉద్దీన్ ఇటీవల కలెక్టర్ దృష్టికితీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు తొలగింపు పనులు చేట్టారు.

డాక్టర్ ప్రవీణ్‌ను కఠినంగా శిక్షించాలి:పీవైఎల్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 16: వైద్య వృత్తికే మచ్చ తెచ్చేలా భార్య, ఇద్దరు బిడ్డల్ని హత్య చేసిన డాక్టర్ ప్రవీణ్‌ను కఠినంగా శిక్షించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ డిమాండ్ చేశారు. మంగళవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. సంఘం నాయకులు మంద సురేశ్, జిక్కుల భరత్, మక్కా రవీందర్, జీ ఆశోక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతువేదికలో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్



నేలకొండపల్లి, జూలై16: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నేలకొండపల్లి రైతు వేదికలో రైతులకు రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలంలో పండించే వివిధ రకాల పంటలకు సంబంధించి ఎరువుల యాజమాన్యం గురించి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు వివరించారు. పసుపుపంటలో ఎరువుల యాజమాన్యం గురించి శాస్త్రవేత్త డాక్టర్ పి.శ్రీనివాస్ రైతులకు వివరించారు. కూసుమంచి ఏడీఏ విజయ చంద్ర మాట్లాడుతూ ఇకపై ప్రతి మంగళవారం రైతువేదికలలో ఉదయం 9.30కు రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓలు దుర్గాభవాని,రామకృష్ణ, ఉదయ్‌కిరణ్, శశిరేఖ, శిరీష, అరవింద్, వెంకటేష్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆందోళన

వైరా, జూలై 16: మండలంలోని రెబ్బవరంలో ఇరుకు భవనంలో ఉన్న రెండు బీసీ గురుకుల బాలికల పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ గురుకులాలకు రెండు భవనాలు ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేష్ అనూష, కావ్య, అలేఖ్య, రమణ, శైలజ డిమాండ్ చేశారు.

మిషన్‌భగీరథ కార్మికుల ఆందోళన

తిరుమలాయపాలెం, జూలై16: మండలంలో పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు మంగళవారం దమ్మాయిగూడెంలో ఆఫీసు వద్ద ఆందోళన చేశారు. నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదని నెలకు రూ.19వేలు ఇవ్వాల్సి ఉండగా 13వేలు ఇస్తున్నారని, న్యాయం చేయాలని ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. ఈవిషయం తెలుసుకున్న ఎస్ఐ గిరిధర్‌రెడ్డి కార్మికులతో మాట్లాడారు. సమస్యలుంఏటి శాంతియుతంగా పరిష్కరించుకోవాలని కోరారు.

మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు అందించాలి

కల్లూరు డివిజన్ బీఆర్టీయూ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి

కల్లూరు: నాలుగు నెలలుగా వేతనాలు అందక మిషన్ భగీరథ కార్మికులు నాన అవస్థలు పడుతున్నారని సత్వరమే వేతనాలు అందిచి ప్రభుత్వం ఆదుకోవాలని కల్లూరు డివిజన్ మిషన్ భగీరథ బిఆర్‌టియు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గొర్రెపాట వేణు, డివిజన్ నాయకుడు చింతలపూడి కృష్ణలు కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. నాలుగు నెలలుగా వేతనాలు అందక కుటుంబాలు ఆర్థిక సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. కనీసం రోజు వారి ఖర్చులకు కూడ పైసలు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారని వారు వివరించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతానాలను సత్వరమే చెల్లించి కార్మికులను ఆదుకోవాలని ఆ సంఘం నాయకులు కోరారు.

2007 తరహాలో రుణమాఫీ చేయాలి



వైరా,జూలై16: 2007తరహాలో రుణమాఫీ చేయాలని, ప్రస్తుతం రుణమాఫీ కోసం విడుదల చేసిన జీవోను సవరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వైరా ఆర్టీసీ బస్టాండ్లో తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మార్గదర్శకాల ప్రతులను దహనం చేశారు. తెల్లరేషన్‌కార్డు, పాస్‌పుస్తకం, రెన్యూవల్, రీషెడ్యూల్ రుణాల్లో నిబంధనలు సవరించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, సంక్రాంతి నర్సయ్య, మాడపాటి వెంకట్, మాదినేని శ్రీనివాసరావు, గుమ్మా నర్సింహారావు, పాపగంటి రాంబాబు, తోట కృష్ణవేణి, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి యర్రా బాబు, మండల కార్యదర్శి యామాల గోపాలరావు, నాయకులు గారపాటి అశోక్, మిట్టపల్లి రాఘవరావు, కొండా రామకృష్ణ, షేక్.షరీఫ్, రమేష్, నర్సింహారావు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఎస్‌జీఎఫ్‌కు కార్యాలయానికి మోక్షం



గదులను పరిశీలిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ఖమ్మంస్పోర్ట్స్‌జూలై16: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)కు జిల్లా అధికారులు ఎట్టకేలకు గదులు కేటాయించారు. సుమారు 20ఏళ్లగా తమకంటూ ఒక కార్యాలయం కోసం తాపత్రయపడిన ఎస్‌జీఎఫ్ సభ్యులకు, వ్యాయాయ ఉపాధ్యాయులకు సొంతంగా ఒక భవనం కేటాయించడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యాయామ ఉపాధ్యాయుల విన్నపం మేరకు డీఈవో సోమశేఖరశర్మ ఎస్‌జీఎఫ్‌కు జమ్మిబండ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని భవనంలోని రెండు గదులను కేటాయించారు. సదరు గదులను ఎస్‌జీఎఫ్ కార్యాలయంగా రూపొందించడం కోసం జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు సరస్పర సహకారంతో తలా కొంత నగదును చందాల రూపంలో సేకరించి ఆయ గదులను సుందరీకరణ చేస్తుండటం విశేషం. అధికారులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

సాయిబాబా దేవాలయాల్లో ఘనంగా పూజలు

ఖమ్మంసాంస్కృతికం, జూలై 16: గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా నగరంలోని సాయిబాబా దేవాలయాల్లో పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి.. గాంధీ చౌక్‌లోని వరప్రదాత షిర్డీ సాయిబాబా దేవాలయంలో సాయిబాబాకు తమలపాకులతో అలంకరించి ప్రత్యేకపూజ నిర్వహించారు. 41వేల తమలపాకులను వినియోగించటం గమనార్హం కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మేళ్ల చెరువు వెంకటేశ్వరరావు, అర్వపల్లి నిరంజన్, కురువెళ్ల జగన్, పీవీడీ ప్రసాద్, కుసుమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. త్రీటౌన్‌లోని శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో పూజలు చేశారు. సుబ్రమణ్యేశ్వర హోమం నిర్వహించారు. సంతానం, కళ్యాణం కోరుకున్న భక్తులు హోమంలో పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై16: రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందిస్తానని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్, జావెద్ అధ్యక్షతన రాయల నాగేశ్వరరావుకు శ్రీమంతరాక్స్ బంధ మిత్రుల ఆధ్వర్యంలో అభినందన ఆత్మీయ సన్మాన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బాగా తెలుసని, వారి కష్టసుఖాల్లో తమ ప్రభుత్వం పాలుపంచుకుంటుందన్నారు. నాపై నమ్మకం ఉంచి ఇంతటి బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీమంతరాక్స్ బంధుమిత్రులు ఇంతటి ఘనసన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడ జావీద్, మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, శ్రీమంతరాక్స్ పార్టనర్ సుడిగాలి కిషన్‌రావు, తుళ్లూరి కోటేశ్వరరావు, నెల్లూరు వెంకటేశ్వరరావు, శీలారెడ్డి, ప్రముఖ న్యాయవాది వడ్డెల్లి కృష్ణమూర్తి, టీడీపీ నేత రామనాధం, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పుసులూరి నరేందర్

రాయలకు ఘనస్వాగతం

నేలకొండపల్లి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా మంగళవారం జిల్లాకు వచ్చిన రాయలకు సూర్యాపేట-ఖమ్మం జిల్లా సరిహద్దు పైనంపల్లి వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. పైనంపల్లి నుంచి ద్విచక్రవాహన ర్యాలీతో రాయల ముదిగొండ మండలంలోని స్వగ్రామం వెంకటాపురంకు వెళ్లారు. అంతకు ముందు నేలకొండపల్లిలో రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిడ్డంగులను రైతులకు అందుబాటులోకి తెస్తానన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఆకుల శేఖర్‌బాబు, బోయిన వేణు, యడవల్లి సైదులు, యడవల్లి నాగరాజు, చిట్ల సైదిరెడ్డి, నాగరాజు, అంజని తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: రాయల నాగేశ్వరరావుకు తన స్వగ్రామమైన ముదిగొండ మండలం వెంకటాపురంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం రాయల తన మాతృమూర్తి రాయల కమలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, నాయకులు బిచ్చాల బిక్షం, పసుపులేటి దేవేంద్రం, శంబయ్య, భద్రారెడ్డి, రామకృష్ణ, ఉసికల రమేష్, రంగారావు, బెజవాడ వంశీ, సీపీఎం నాయకులు రాయల వెంకటేశ్వర్లు, కందుల భాస్కర్‌రావు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: తెలంగాణరాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగి మంగళవారం ఖమ్మంకు వచ్చిన రాయల నాగేశ్వరరావుకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. మాజీసర్పంచ్ సంద్ర వెంకన్న, పోట్ల రమేష్, వాలూరి సత్యనారాయణ, పత్తి నాగేశ్వరరావు, ఉన్నం రాజశేఖర్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

వేంసూరుకు చేరిన బేతుపల్లి వరద నీరు

వేంసూరు, జూలై 16: సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు నిండటంతో వరదనీరు ఎన్టీఆర్ కెనాల్ ద్వారా వేంసూరు మండలానికి సోమవారం కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. ఈనీరు మంగళవారం వేంసూరుకు చేరడంతో పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు గంగమ్మకు పూజలు చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి వల్లే వేంసూరు మండలానికి సాగునీరందుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, వెల్ది జగన్మోహన్‌రావు, ఎండీ.ఫైజుద్దీన్, ఎర్రా సత్యం, నర్సింహారావు, కుక్కపల్లి శ్రీనివాసరావు, కుక్కపల్లి సత్యం, మల్లెల నర్సింహారావు, ఎండీ.ఇమామ్‌పాషా, తుంబూరి రామిరెడ్డి, మేడా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమ్మపాలెం పెద్దచెరువుకు బేతుపల్లి నీరందించాలి

వేంసూరు మండలం అమ్మపాలెం పెద్దచెరువుకు ఎన్టీఆర్ కెనాల్ ద్వారా బేతుపల్లి నీటిని అందించాలని ఆగ్రామ రైతులు కోరుతున్నారు. ఎన్టీఆర్ కెనాల్ నుంచి అమ్మపాలెంకు వెళ్లే ఫీడర్ కెనాల్‌లో పూడిక పేరుకుపోవడంతో ఆచెరువుకు నీళ్ల వచ్చే అవకాశం లేదని, లచ్చన్నగూడెం వద్ద ఈ కాల్వలో పూడిక తొలగించి నీటిని విడుదల చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే రాగమయి, నీటిపారుదలశాఖ అధికారులు కృషిచేయాలని రైతులు కోరారు.


సునాయాసంగా కొలువులు సాధించండి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హరికృష్ణ

సత్తుపల్లి,జూలై16: పుస్తక పఠనంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, సాఫ్ట్‌స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవడంతో కొలువులను సునాయాసంగా సాధించవచ్చునని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అన్నారు. 20రోజులుగా కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీర్ ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమం మంగళ వారంతో ముగిసింది. ఈ శిక్షణను కాగ్నిజెంట్, ఆక్సెంచర్, ఐబీఎం సంస్థల ద్వారా మాక్స్ స్కిల్స్ ల్యాబ్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, ప్లేస్‌మెంట్స్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్ టీ.రాఘవరాజు పాల్గొన్నారు.

న్యూలిటిల్ ఫ్లవర్‌లో బోనాలు



వైరా,జూలై16:వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో మంగళవారం మహంకాళి అమ్మవారి బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ బోనాల విశిష్ఠత గురించి వివరించారు. బోనమంటే భోజనం కొత్త మట్టికుండలోగాని, రాగిబిందెలో గాని అమ్మవారికి భోజనం, బెల్లం, ఆకుకూరలతో కలిపి సమర్పించటమని తెలిపారు. శక్తిస్వరూపిని అయిన అమ్మ వారిని పూజలు నిర్వహిస్తారని వివరించారు. ఏవో ఎస్.నర్సింహారావు, ప్రిన్సిపాల్ మాథ్యూవ్ పాల్గొన్నారు.